సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
గురువారం, 02.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 160
పేజీలు: 12 వెల: రూ. 5

## అమరావతి ఇక అజేయం..
# అజరామరం
### అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభ ఆమోదం



- అమరావతి బిల్లు తదుపరి అడుగు రాజ్యసభ
- 2 గంటల చర్చ తర్వాత ఆమోదం.. అమరావతికి కేంద్ర మద్దతు
- వలు పార్టీల చర్చల మధ్య బిల్లు పాస్.. రాజ్యసభలో కీలక పరీక్ష
- ఏపీ రాజధాని స్పష్టత దిశగా అడుగు.. గురువారం రాజ్యసభలో బిల్లు

10

## తెలంగాణ పల్లెలకు జాతీయ పురస్కారాలు



- గుడ్ ఫర్ గవర్నెన్స్ విభాగంలో మోతుకుపల్లికి అవార్డు
- 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో మెరిసిన ఫసల్వాడి
- మంత్రి సీతక్క హర్షం

09




## భూ సమస్యలకు
# శాశ్వత పరిష్కారం

సమీకృత భూభారతి పోర్టల్‌తో తొలి అడుగు

- రేపటి నుంచి ఐదు మండలాల్లో అమలు
- స్మార్ట్ ఫోన్‌తో ఇంటి నుంచే భూ సేవలు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

03

రాష్ట్రంలో దశాబ్దాలుగా వేధిస్తున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందికి తెస్తూ రూపొందించిన 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రేపటి (ఏప్రిల్ 2) నుంచి రాష్ట్రంలోని ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. కేరళ పర్యటనలో ఉన్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఈ వివరాలను వెల్లడించారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, రోవర్ల ద్వారా అత్యాధునిక సర్వే నిర్వహించడం, ప్రతి భూమికి ఆధార్ తరహాలో 'భూధార్' నంబర్‌ను కేటాయించడం ఈ విధానం ప్రధాన ఉద్దేశం. దీనివల్ల రైతులు మీ–సేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇంటి నుంచే పారదర్శకంగా భూ సేవలు పొందవచ్చని మంత్రి స్పష్టం చేశారు.

## తేయాకు తోటల్లో
# చాయ్‌వాలా
### కూలీలతో కలిసి తేయాకు కోసిన మోదీ

10

- అక్కడి స్థితిగతులపై స్థానికులతో ముచ్చట్లు
- కూలీగా మారిన ప్రధానితో కార్మికుల సెల్ఫీలు
- అస్సాం ఎన్నికల ప్రచారంలో వినూత్నశైలిలో మోదీ



చిన్నప్పుడు రైల్వే స్టేషన్‌లో వేడి వేడి టీ కప్పులను అందిస్తూ సామాన్యుల దాహాన్ని తీర్చిన ఆ చేతులు.. నేడు అస్సాం తేయాకు తోటల్లో ఆకులను తుంచుతూ శ్రమజీవుల కష్టాన్ని స్పృశించాయి. ప్రోటోకాల్ గోడలను బద్దలు కొట్టి, భద్రతా వలయాన్ని పక్కన పెట్టి, పచ్చని తోటల్లో మహిళా కూలీలతో మమేకమైన ప్రధాని మోదీ రూపం అస్సాం గుండెలను గెలుచుకుంది. ఒకప్పుడు టీ అమ్మిన చాయ్‌వాలా, నేడు దేశ ప్రధానిగా అదే తేయాకు తోటల సాక్షిగా తన మూలాలను గుర్తుచేసుకుంటూ, అక్కడి కార్మికులతో కలిసి సెల్ఫీలు దిగుతూ సామాన్యుడిలో సామాన్యుడిగా మారిపోయిన తీరు అందరినీ కదిలించింది.

-ముద్ర డెస్క్ :

## కొత్తగా 62 వేల మందికి రైతు భరోసా
### కొత్త పాస్ పుస్తకాలు ఉన్న వారికీ ఇవ్వాలని సర్కార్ నిర్ణయం



- దరఖాస్తుల పరిశీలన తర్వాత తుది జాబితా
- ఈ నెల 20లోపు రెండో విడత భరోసా

09

భారత్‌పై పశ్చిమాసియా యుద్ధం ప్రభావం
# సెగ మొదలైంది?!

- అంతర్జాతీయ మార్కెట్ లో చమురు ధరల పెంపు
- గ్యాస్ సరఫరాలో అంతరాయం
- పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్
- ఆకాశానికి ఎగబాకిన కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు
- హైదరాబాద్ లో రూ.214.50కు పెంపు
- భాగ్యనగరంలో ఆటో ఎల్పీజీ గ్యాస్ కొరత తీవ్రరూపం
- సాగర్ రింగు రోడ్డు వద్ద ఆటో డ్రైవర్ల ఆందోళన
- భారీగా ట్రాఫిక్ జామ్, పోలీసుల రంగ ప్రవేశం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
పశ్చిమాసియాలో మొదలైన యుద్ధం భారత్‌లో ఇంధన ధరలకు రెక్కలు తొడుగుతున్నాయి. ఈ యుద్ధం కారణంగా దేశ ప్రజలు చమురు, గ్యాస్ ప్రభావాన్ని ఎదుర్కొంటుండగా తాజాగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తమ ప్రీమియం పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచింది. వీటికి తోడు కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు ఆకాశానంటాయి. ఢిల్లీలో హెచ్‌పీ100 పెట్రోల్ ధర రూ.149 నుంచి ఏకంగా రూ.160 కి ఎగబాకింది. మరోవైపు లీటరుకు రూ. 91.49 ఉన్న ఎక్స్‌ట్రా గ్రీన్ ప్రీమియం డీజిల్ ధర సుమారు రూ.1.50 మేర మిగతా 02లో

## కాళేశ్వరం చక్రబంధం
### అటు కేంద్రం.. ఇటు రాష్ట్రం.. ఉక్కిరిబిక్కిరి అవుతున్న గులాబీ దళం!

- కాళేశ్వరం చుట్టూ రాజకీయ మల్ల యుద్ధం
- అసెంబ్లీ నుంచి పార్లమెంట్ వరకు కాళేశ్వరం హాట్ టాపిక్
- కాళేశ్వరం వ్యవహారం బీఆర్ఎస్‌కు భారమా?
- బీఆర్ఎస్‌కు కఠిన పరీక్ష
- కాళేశ్వరం అంశం నుంచి బయటపడే మార్గం ఏమిటి?




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణలో విపక్షం బీఆర్ఎస్ ను టార్గెట్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకకాలంలో చేస్తున్న దాడి రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ఇక్కడ అసెంబ్లీలో.. అక్కడ పార్లమెంటులో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వాలు చేసిన ప్రకటనలు బీఆర్ఎస్ పార్టీని ఉక్కిరిబిక్కిరికి గురిచేస్తున్నాయని అంటున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ప్రపంచంలోనే పెద్ద ఎత్తిపోతల పథకమని, ఇంజనీరింగ్ అద్భుతమని ప్రచారం చేసుకున్న కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భిన్నమైన వాదన వినిపిస్తున్నాయి. గత ఎన్నికల ముందు మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుతో ప్రాజెక్టు పనుల్లో అవినీతి జరిగిందని రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఆరోపిస్తుంటే, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్ష కోట్ల గంగ పాలయ్యాయని కేంద్ర జలశక్తి మంత్రి తాజాగా చేసిన వ్యాఖ్యలు అగ్గి రాజేస్తున్నాయి. మిగతా 02లో

## ప్రపంచానికి మరో ఉపద్రవం
### ఎర్ర సముద్రంపై ఇరాన్ కన్ను



- గ్లోబల్ ట్రేడ్‌కు ముప్పు
- నియంత్రణకు రంగంలోకి హౌతీలు
- నౌకల ప్రయాణం ఆగితే ప్రపంచానికి భారీ నష్టం
- ఇరకాటంలో ఆయిల్ దిగుమతి దేశాలు

02

## ఇంధన ధరలు పెంచే
# ప్రసక్తే లేదు




### ప్రకటనలో కేంద్ర పెట్రోలియం శాఖ

- యుద్ధ ప్రభావం ఉన్నా.. ధరలు యథాతథం
- చమురు ధరలు పెరిగినా ప్రజలకు షాక్ లేదు
- బ్రెంట్ క్రూడ్ 100 డాలర్లు దాటినా ధర పెరగదు!
- రెండు నెలలకు సరిపడా నిల్వలు
- ఇంధనంపై భారం తగ్గించడమే లక్ష్యం

02

## హైదరాబాద్‌లో సమృద్ధిగా
# ఇంధనం, ఎల్పీజీ
### జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి



- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- సరఫరా వ్యవస్థపై అసత్య ప్రచారం నమ్మొద్దు

02

## మీసేవ యూజర్
# ఛార్జీలు పెంపు
### కనిష్ఠంగా రూ. 35 ఉన్న సర్వీస్ ఛార్జ్ రూ. 62

బి-కేటగిరీ సేవలకు రూ. 80

విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఆర్టీఏ సేవలు, ఇతర ప్రభుత్వ అప్లికేషన్లు పైనా భారం

02




## హైదరాబాద్
# హై అలర్ట్
### నేడు నగరంలో 168 శోభాయాత్రలు

- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల డేగకన్ను
- రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు
- మూడు కమిషనరేట్ల పరిధిలో మద్యం బంద్
- కోఠి, అబిడ్స్, నారాయణగూడ, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, సికింద్రాబాద్ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు
- ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆంక్షలు

03






## ఈ నెల 15 వరకు
# ఇంటింటికీ సీపీఐ
### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని


- పార్టీ కోసం ప్రజల నుంచి విరాళాల సేకరణ
- అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ఉద్యమం
- సంతృప్తికరంగా అసెంబ్లీ సమావేశాలు
- స్పీకర్ ఎవరి గొంతు నొక్కలేదు
- మరిన్ని రోజులు కొనసాగిస్తే మరింత ఉపయుక్తంగా ఉండేది

10

# శ్రీ ఆంజనేయం
### కొండగట్టులో చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు

- పెద్ద ఎత్తున తరలివస్తున్న దీక్షాపరులు
- అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- 750 మందితో భద్రత
- కూలిన పందిరి

09



ఇదీ ఏఐ ముద్ర

54ఏళ్ల తర్వాత.. జాబిల్లిపైకి మనుషులను పంపుతున్న నాసా.. ఆర్టెమిస్ 2 రాకెట్ కౌంట్ డౌన్ స్టార్ట్.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 02.04.2026
www.mudranews.in | @mudranews



## సంతోషకరమైన దేశం ఫిన్లాండ్



ప్రపంచంలో వరుసగా అత్యంత సంతోషకర దేశంగా నిలుస్తోంది.ఉన్నత జీవన ప్రమాణాలు, మంచి విద్య, విశ్వాసపూరిత సమాజం దీనికి కారణం.

## కాళేశ్వరం చక్రబంధం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాళేశ్వరం కేంద్రంగా బీఆర్ఎస్ పార్టీతో బంతాట ఆడుతున్నట్లు ఉందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా, కాళేశ్వరం ప్రాజెక్టును పెద్ద ఘనతగా ఆ పార్టీ నేతలు చాటుకున్నారు. అయితే ఎన్నికల ముందు బ్యారేజ్ కూలిపోవడం ఆ పార్టీకి పెద్ద షాక్ గా మారింది. ఆ తర్వాత ఈ ఉదంతాన్ని అవకాశంగా మలుచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీసేలా సందర్భం దొరికిన ప్రతిసారి తన అస్త్రాలు వదులుతున్నారు. రెండు రోజుల క్రితం అసెంబ్లీలో చర్చ సందర్భంగా కాళేశ్వరంపై బీఆర్ఎస్, బీజేపీ నేతలను టార్గెట్ చేస్తూ సీఎం తీవ్ర ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయాలని బీజేపీ నేత, హోంమంత్రి అమిత్ షా అన్నారని, కానీ తాము సీబీఐ విచారణకు లేఖ రాసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని బీజేపీ నేతలను ఇరుకున పెట్టేలా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

ఇక సీఎం ఆరోపణల ఎఫెక్టో, మరే కారణమో తెలియదు కానీ, సోమవారం రాజ్యసభలో తెలంగాణ సాగునీటి సమస్యలపై బీఆర్ఎస్ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి ప్రశ్న వేస్తే, కేంద్ర జలశక్తి మంత్రి 'కాళేశ్వరం' ప్రాజెక్టును ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ పార్టీపై ఎదురుదాడి చేశారు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి ఎక్కడా ఉపశమనం లభించడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. రెండు వైపుల నుంచి బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేయడం, ఎవరు కూడా కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల మేలు జరిగిందని, అభివృద్ధికి తోడ్పడిందని చెప్పకపోవడంతో బీఆర్ఎస్ రాజకీయంగా డిఫెన్సులో పడినట్లు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ పరిణామాలతో బీఆర్ఎస్ పార్టీ తమ ఘనతగా చాటుకున్న కాళేశ్వరంపై ఎలా ముందుకు వెళ్లాలో తేల్చుకోలేకపోతోందని అంటున్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకమైనట్లు వ్యవహరిస్తుండటంతో బీఆర్ఎస్ పార్టీ ఒక సంక్లిష్టతను ఎదుర్కొంటోందని వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు కేవలం నీటి సమస్య కాకుండా తెలంగాణ రాజకీయాలను శాసించే అతిపెద్ద రాజకీయ యుద్ధంగా రూపుదిద్దుకుందని అంటున్నారు. దీని నుంచి బయటపడేందుకు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు వినిపిస్తున్న వాదనకు పెద్దగా బలం ఉండటం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితి నుంచి పార్టీని బయటపడేయ గలిగిన సత్తా కేవలం పార్టీ అధినేత కేసీఆర్ కు మాత్రమే ఉందని ఆ పార్టీ నేతలు నమ్ముతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాటల దాడిని కేసీఆర్ ఎలా తిప్పికొడతారనేది ఉత్కంఠ రేపుతోందని, ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నామని గులాబీ పార్టీ కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

## సెగ మొదలైంది?!



(మొదటి పేజీ తరువాయి)

పెరిగి రూ. 92.99కి చేరుకుంది. పెట్రోల్ మెరుగైన ఇంజిన్ పనితీరు కోసం దీనిని హై-ఎండ్ కార్లు, సూపర్ బైక్‌లలో వాడుతారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, సరఫరాలో అంతరాయాల కారణంగా ఈ ధరల పెంపు అనివార్యమైంది.

**విమాన ఇంధన ధరలు భారీగా పెంపు**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన ఇంధన ధరలు భారీగా పెరిగాయి. రికార్డు స్థాయిలో కిలోలీటర్ విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధర రూ. 2.07 లక్షలకు చేరుకుంది. గత నెలలో ఏటీఎఫ్ కిలోలీటర్‌కు రూ.96,638 ఉండగా, ఏప్రిల్ నెలకు సంబంధించి చమురు సంస్థలు ధరలను రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ఏటీఎఫ్ పెంపుతో విమానయాన సంస్థలు భారీగా టికెట్ ధరలను పెంచే అవకాశం ఉంది.

**పెరిగిన కమర్షియల్ సిలిండర్ ధరలు**

తాజా పరిస్థితుల నేపథ్యంలో 19 కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర భారీగా పెరిగింది. మార్చి 1న రూ. 1,768.50 ఉన్న సిలిండర్ ధర ఈనెల ఒకటో తేదిన ఏకంగా రూ. 2,078.50కి చేరింది. నెల రోజుల్లోనే రూ. 310 పెరిగింది. హైదరాబాద్ 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.214.50కి పెరిగి రూ. 2,321 కి చేరుకుంది.

**ఆటో డ్రైవర్ల ఆందోళన..**

హైదరాబాద్ నగరంలో ఆటో ఎల్పీజీ గ్యాస్ కొరత తీవ్ర రూపం దాల్చింది. గ్యాస్ కోసం గంటల తరబడి ఎదురుచూసి విసిగిపోయిన ఆటో డ్రైవర్లు బుధవారం రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టారు. సాగర్ రింగ్ రోడ్డు, ఎల్బీ నగర్, బహదూర్‌పురా, రాజేంద్రనగర్ వంటి పలు ప్రాంతాల్లో రాస్తారోకోలు, ధర్నాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రెండు వారాలుగా ఈ సమస్య కొనసాగుతుండటంతో తమ జీవనోపాధి దెబ్బతింటోందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర బారులు తీరి, రాత్రంతా వేచి ఉన్నా గ్యాస్ దొరకడం లేదని వాపోతున్నారు. నిరసనలో భాగంగా కొందరు డ్రైవర్లు రాజేంద్రనగర్‌లో సెల్ టవర్ ఎక్కి ఆందోళన చేయగా, బహదూర్‌పురాలో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.

**55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీ కొరత**

రాష్ట్రంలో రోజుకు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీ కొరత ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా విదేశాల నుంచి గ్యాస్ దిగుమతులు ఆలస్యం కావడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించి, సరఫరాను పెంచాలని చమురు సంస్థలను ఆదేశించారు. ఆందోళనల నేపథ్యంలో పలుచోట్ల పోలీసులు రంగ ప్రవేశం చేసి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. నిరసన చేస్తున్న డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అయితే, గ్యాస్ కొరత సమస్య పరిష్కారం కాకపోవడంతో తమ ఆందోళనలు కొనసాగిస్తామని ఆటో డ్రైవర్ల సంఘాలు చెబుతున్నాయి.

## ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేదు

**ముద్ర డెస్క్ :**
పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయన్న ఆందోళనలు వ్యక్తం అమవుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రం స్పందిస్తూ.. 'ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేద'ని స్పష్టం చేసింది. దేశంలో చమురు నిల్వలు సరిపడా ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. 'దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు రెండు నెలలకు సరిపడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో అధికంగా కొనాల్సిన అవసరం లే దు. ప్రస్తుతం ఎల్పీజీ(LPG) నిల్వలు కూడా సరిపడా ఉన్నాయి. ఒక వేళ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే తీసుకోవాల్సిన చర్యలపై కేంద్రం యోచిస్తోంది. రిఫైనరీలు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. రెండు నెలల క్రితం బ్యారెల్‌కు 70 డాలర్ల దగ్గర ట్రేడ్ అయిన బ్రెంట్ క్రూడ్, ఈ రోజు 100 డాలర్ల మార్కును దాటింది. 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు డీజిల్, పెట్రోలు ధరలను పెంచలేదు. వినియోగదారులపై భారం తగ్గించేందుకు ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాం' అని పేర్కొన్నారు.

## ప్రపంచానికి మరో ఉపద్రవం

**ముద్ర, డెస్క్:**
గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. హర్మూజ్ జలసంధిపై ఇప్పటికే తన ప్రభావాన్ని చూపుతున్న ఇరాన్, ఇప్పుడు ఎర్ర సముద్రంపై కూడా కన్నేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ మద్దతుతో యెమెన్‌కు చెందిన హౌతీ మిలీషియా ఎర్ర సముద్రంలో ప్రభా వాన్ని పెంచేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గల్ఫ్ దేశాల నుంచి ఆయిల్ రవాణాకు ఎర్ర సముద్రం కీలక మార్గం. ఈ మార్గంలో నౌకల ప్రయాణం అడ్డంకులకు గురైతే ప్రపంచ వ్యాప్తంగా చమురు సరఫరా దెబ్బతినే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఆయిల్ దిగుమతులపై ఆధారపడిన దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొనవచ్చు. ప్రస్తుత పరిణామాలతో అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన భద్రతపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నా యి. ఎర్ర సముద్ర ప్రాంతంలో భద్రతా పరిస్థితులు మరింత కీలకంగా మారుతున్నాయి.




## హైదరాబాద్ లో సమృద్ధిగా
# ఇంధనం, ఎల్పీజీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
హైదరాబాద్ జిల్లాలో ఇంధనం, ఎల్పిజి సమృద్ధిగా ఉందని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి పునరుద్ఘాటించారు. పశ్చిమాసియా యుద్ధం ప్రభావం పేరుతో ఎవరైనా అక్రమ నిల్వలతో కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో ఆటోవాలాలు, గృహ వినియోగదారులు అనవసరంగా ఆందోళన చెందవద్దని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ లభ్యత, నిల్వలు, సరఫరా పరిస్థితులపై ఏజెన్సీ నిర్వాహకులు, డిస్ట్రిబ్యూటర్లతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో సుమారు 18.62 లక్షల గృహ ఎల్పీజీ కనెక్షన్లు, 69 ఎల్పీజీ కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. గృహ వినియోగ ఎల్పీజీ సరఫరా సాధారణ స్థితిలో ఉన్నప్పటికీ, దిగుమతుల తగ్గుదల కారణంగా ప్రైవేట్ ఆపరేటర్లు ప్రధానంగా నిర్వహిస్తున్న ఆటో ఎల్పీజీ విభాగంలో కొంత ఒత్తిడి ఉందని తెలిపారు. ఇటీవల ప్రజల్లో ఆందోళన కారణంగా గృహ ఎల్పీజీ బుకింగ్స్ తాత్కాలికంగా పెరిగి, రోజువారీ సగటు కంటే అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. వచ్చే 15 రోజుల్లో సరఫరాను పెంచి పరిస్థితిని స్థిరీకరించాలని అధికారులను ఆదేశించారు. ఇంధన పంపిణీ కేంద్రాల వద్ద ప్రజలకు సౌకర్యం కల్పించేందుకు, సరఫరా సజావుగా కొనసాగేందుకు ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. సివిల్ సప్లైస్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయాలు వంటి అక్రమాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సహాయ సరఫరా అధికారులు ఇంధన అవుట్‌లెట్‌లు, ఎల్‌పిజి గ్యాస్ ఏజెన్సీలను నిశితంగా పర్యవేక్షించి, నిల్వలు, సరఫరా స్థితి యొక్క వివరాలను అందించాలని ఆదేశించారు. ఇంధన పంపిణీ కేంద్రాలు, రవాణా వాహనాలు, సిబ్బందికి భద్రత కల్పించేందుకు పోలీస్ శాఖ మరింత పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. ప్రజల్లో ఉన్న ఆందోళన తగ్గుముఖం పట్టిందని, డిమాండ్ క్రమంగా సాధారణ స్థితికి వస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ వసతి గృహాలు, ఆసుపత్రులు, ఆరోగ్య శ్రీ, అంగన్వాడీ కేంద్రాలలో సరఫరా నిరంతరం ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

**అప్రమత్తంగా ఉన్నాం**

షేక్‌పేట్ అలాగే పంజాగుట్ట ప్రాంతాల్లో నమోదైన ఎల్పీజీ ఘటనలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, తగిన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. బుకింగ్, రీఫిల్లింగ్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. రెండు సిలిండర్ల కనెక్షన్ కలిగిన వినియోగదారులు డబుల్ బుకింగ్స్ పరిశీలన చేయాలని ఒక్క సిలిండర్ కనెక్షన్ ఉన్న కుటుంబాలకు ప్రాధాన్యతనిస్తూ, అందరికీ కనీస అవసరమైన ఒక సిలిండర్ అందిన తర్వాతే రెండో సిలిండర్ కేటాయింపులు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో డేటా ఆధారంగా బుకింగ్ లను ఎప్పటికప్పుడు పరిశీలించి అనవసర బుకింగ్స్, దుర్వినియోగాన్ని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయిల్ కంపెనీలు, ఎల్పీజీ ఏజెన్సీలకు సూచించారు. ప్రజలు, వాహన వినియోగదారులు అధికారిక సమాచారాన్ని మాత్రమే ఆధారంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏవైనా సమస్యలు లేదా అక్రమాలు గమనించిన పక్షంలో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు. భయాందోళనలు సృష్టించడం, ప్రజా శాంతిని భంగం కలిగించడం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిస్థితిపై కమిటీ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, అవసరమైన చర్యలు వేగంగా చేపడుతుందని పునరుద్ఘాటించారు.

**సాంకేతిక సమస్యలు**

సిలిండర్ డెలివరీ ఆలస్యాలపై చర్చ సందర్భంగా, అధిక బుకింగ్స్ కారణంగా ఓటీపీ ఆధారిత ధృవీకరణ వ్యవస్థపై ఒత్తిడి పెరగడంతో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని ఎల్పీజీ ఏజెన్సీ ప్రతినిధులు కలెక్టర్ కు వివరించారు. పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో సరిపడా నిల్వలు ఉన్నాయని, సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నట్లు కలెక్టర్ కు తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ రేష్మి ఆఫీసర్ రాజి రెడ్డి, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి శ్రీనివాస్, అదనపు డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ (టాస్క్ ఫోర్స్) శ్రీనివాస్, జిల్లా మేనేజర్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్, అసిస్టెంట్ సివిల్ సప్లైస్ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, వైద్య, రవాణా, సంక్షేమ అధికారులు, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి
# కీలక అడుగులు

**పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్..**

**రేపు కేంద్ర పర్యాటక,సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో భేటీ**

**ముద్ర అమరావతి:**
కొత్త ఆర్థిక సంవత్సర ఆరంభంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా దృఢమైన చర్యలు చేపడుతోంది. రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ పర్యటనలో భాగంగా కేంద్ర పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ కానున్న దుర్గేష్, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పర్యాటక ప్రాజెక్టులకు ఆమోదం పొందేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా రూ. 900 కోట్లకు పైగా విలువైన కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలు సమర్పించడం ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి ఊపిరి పోసే ప్రయత్నం చేస్తున్నారు.

మచిలీపట్నం బీచ్ అభివృద్ధి, లేపాక్షి, లంబసింగి వంటి ప్రముఖ పర్యాటక కేంద్రాల అభివృద్ధి, అలాగే వివిధ దేవాలయాల ఆధారంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించే ప్రణాళికలు ఈ ప్రతిపాదనల్లో ముఖ్యమైనవి. ఈ ప్రాజెక్టులు అమలు అయితే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి.

అదే సమయంలో, తెలుగు భాషా సంపదను కాపాడేందుకు 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' పునర్ముద్రణపై కూడా ప్రభుత్వం దృష్టి సారించడం విశేషం. సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, ఆధునిక సాంకేతికతతో దానిని ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం మీద, సీఎం చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో చేపడుతున్న ఈ కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటక హబ్‌గా మార్చే దిశగా కీలక మైలురాయిగా నిలుస్తాయని చెప్పవచ్చు. ఈ ప్రాజెక్టులకు కేంద్ర మద్దతు లభిస్తే రాష్ట్రానికి ఆర్థికంగా, సాంస్కృతికంగా భారీ ప్రయోజనం కలగనుంది.



# మీసేవ యూజర్ ఛార్జీలు పెంపు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో వివిధ రకాల ధృవీకరణ పత్రాలు, బిల్లు చెల్లింపుల కోసం వసూలు చేసే యూజర్ ఛార్జీలను భారీగా పెంచింది. ఈ మేరకు ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కనిష్ఠంగా రూ. 35 ఉన్న సర్వీస్ ఛార్జీని ఇప్పుడు ఏకంగా రూ. 62కు పెంచారు. పెరిగిన ధరలు బుధవారం నుంచే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తాజా పెంపు ప్రకారం.. తక్షణమే లభించే ఏ-కేటగిరీ సర్టిఫికెట్ ప్రింట్ వంటి సేవలకు రూ. 62 వసూలు చేయనుండగా.. ఇన్‌కం, క్యాస్ట్, నివాస ధృవీకరణ పత్రాల వంటి బి-కేటగిరీ సేవలకు రూ. 80గా ధరను నిర్ణయించారు. వీటితో పాటు విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఆర్టీఏ సేవలు, ఇతర ప్రభుత్వ అప్లికేషన్లపై కూడా అదనపు భారం పడనుంది. ఇన్‌కం సర్టిఫికేట్‌కు గతంలో రూ.45 నుంచి రూ.55 ఉండగా.. తాజా సవరణల ప్రకారం రూ.80కి చేరింది. కుల ధ్రువీకరణ పత్రం గతంలో రూ.45 నుంచి 55 ఉంగా.. ఇప్పుడు రూ.80కి చేరింది. స్థానికత ధ్రువీకరణ పత్రం గతంలో రూ.45 నుంచి రూ.55 ఉండగా.. ప్రస్తుతం రూ.80కి పెంచారు. అదేవిధంగా జనన ధ్రువీకరణ పత్రం ప్రింట్ గతంలో రూ.40 నుంచి రూ.45 ఉండగా.. తాజాగా రూ.62కు పెంచారు. దీంతో సాధారణంగా విద్యాసంస్థల్లో ప్రవేశాలకు, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు క్యాస్ట్, ఇన్‌కం, నివాస ధ్రువీకరణ పత్రాలను విధిగా తీసుకోవాల్సి ఉంటుంది. తాజాగా ఈ మూడింటి ధరలను ఏకంగా రూ. 80కు పెంచడంతో మధ్యతరగతి, పేద వర్గాల విద్యార్థులపై ఆర్థిక భారం పడనుంది. కాగా, చాలా కాలంగా మీసేవ కేంద్రాల నిర్వాహకులు తమకు వచ్చే కమీషన్ పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పెరిగిన విద్యుత్ బిల్లులు, ఇంటర్నెట్, సిబ్బంది ఖర్చుల దృష్ట్యా ఈ పెంపు అనివార్యమని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ క్రమంలోనే తాజాగా ఛార్జీలు పెంచారు. అయితే ఛార్జీలను భారీగా పెంచటంపై సామాన్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


**వాట్సాప్ మీ-సేవ సూపర్ హిట్**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ మీ-సేవ విధానానికి ప్రజల నుంచి భారీ ఆదరణ లభిస్తోంది. కేవలం ఒక వాట్సాప్ మెసేజ్‌తో 581 రకాల ప్రభుత్వ సేవలను పొందే వెసులుబాటును సర్కార్ కల్పించింది. 8096958096 నంబర్ ద్వారా 24 గంటల పాటు పదికి పైగా ప్రభుత్వ శాఖల సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచారు. రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ వంటి 10కి పైగా కీలక ప్రభుత్వ శాఖలకు చెందిన ధృవీకరణ పత్రాలు, బిల్లుల చెల్లింపులు వంటి సేవలు ఇందులో అందుబాటులో ఉన్నాయి. మీ-సేవ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా తక్కువ సమయంలో పారదర్శకంగా సేవలు అందుతుండటంతో డిజిటల్ తెలంగాణ దిశగా ఇది ఒక కీలక అడుగుగా నిలిచింది.



**డెన్మార్క్**

సమానత్వం, సోషల్ సెక్యూరిటీ వ్యవస్థ చాలా బలంగా ఉంటుంది. "హ్యూగ్గే" జీవనశైలి ప్రజల్లో సంతోషాన్ని పెంచుతుంది.





# నారెడ్కో అధ్యక్షుడిగా శ్రీధర్ రెడ్డి

- **నూతన కమిటీ నియామకం**
- **రెండేళ్ల పాటు కొనసాగనున్న కమిటీ**

**ముద్ర, హైదరాబాద్:**

జాతీయ రియల్ ఎస్టేట్ అభివృద్ధి కౌన్సిల్ (నారెడ్కో) అధ్యక్షుడిగా శ్రీధర్ రెడ్డి కొప్పుల నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గా కాలి ప్రసాద్ డామేరా, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గా గోపాల కృష్ణ కొరివల్లి, సెక్రటరీ జనరల్ గా వెంకటేశ్వర రావు రావుల, కోశాధికారిగా సుధాకర్ రెడ్డి కండాల ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని ఏపీఆర్ ఐల్‌లో జరిగిన సంఘం 30వ వార్షిక సాధారణ సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకుని అధికారికంగా ప్రకటించారు. వీరు 2028 వరకు రెండేళ్ల పాటు సంఘం కార్యకలాపాలను అధికారికంగా పర్యవేక్షించనున్నారు. కొత్తగా నియమించిన ఈ కమిటీ ప్రముఖ పరిశ్రమ నిపుణులకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగంలో స్థిరమైన వృద్ధి, వృత్తిపరమైన ప్రతిభను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని సభ్యులు తెలిపారు.

# కాళేశ్వరంపై కేంద్రమంత్రి తప్పుదోవ

- **సీఆర్ పాటిల్ పై మాజీ ఎంపీ వినోద్ అసహనం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ రాజ్యసభను తప్పుదోవ పట్టించారని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని అనేకసార్లు బీఆర్ఎస్ ఎంపీలు డిమాండ్ చేశారని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా రెండింతలు వ్యవసాయం పెరిగిందని చెప్తూనే, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం ద్వారా లక్ష కోట్లు నీళ్లలో కలిసిపోయాయని ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనం ఏంటో తమ నాయకుడు హరీశ్‌రావు అనేక సార్లు వివరాలతో సహా చెప్పారన్నారు. ప్రాజెక్టులో భాగమైన అన్నీ కొట్టుకుపోయాయా అని ప్రశ్నించారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు కాలేదని తెలిపారు. పాటిల్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎంపీలు లేఖ రాసినట్లు చెప్పారు. రాజ్యసభ హుందాతనం కాపాడాలంటే పాటిల్ వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఏది చెప్తే కేంద్రం అది చేస్తున్నదని ఆరోపించారు.

# ఉద్యమకారులను కాల్చి చంపింది కాంగ్రెస్

- **లోక్ సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**





జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన ఘనత కాంగ్రెస్ కే దక్కిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 1969లో కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ పోరాటంలో పాల్గొన్న 369 మందిని తుపాకులతో కాల్చి చంపిందని విమర్శించారు. చివరి దశలో కూడా 1200 మంది ఆత్మ బలిదానంతో తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. చివరకు తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. బుధవారం లోక్ సభలో ప్రవేశపెట్టిన అమరావతి చట్టబద్ధత బిల్లు సందర్భంగా కిషన్ రెడ్డి.. తెలంగాణ విభజన అంశాన్ని ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క ఎయిర్ పోర్టు మాత్రమే ఉందన్నారు. ఈ పరిస్థితికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలే కారణమన్నారు. రాష్ట్రాల విభజన తర్వాత ఏపీ ప్రజలు తమ రాజధాని ఏదో చెప్పుకోలేని పరిస్థితి రావడం బాధాకరమన్నారు. తెలంగాణ బీజేపీ తరపున అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

# విభజన హామీలు అమలు చేయండి

- **ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అరోపించారు. ఆంధ్రప్రదేశ్ కు అదనపు నిధులివ్వడంపై తమకెలాంటి అభ్యంతరం లేదని, తెలంగాణకు కూడా నిధులు ఇవ్వాలని కోరారు. బుధవారం లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన ఈ విషయాలను ప్రస్తావించారు. ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్ వంటి వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేయడంతో పాటు.. బయ్యారంలో స్టీల్ ప్లాంటును కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఎంపీ పేర్కొన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మూసీ ప్రాజెక్టుకు, రీజినల్ రింగ్ రోడ్డు, కేటీపీఎస్ విస్తరణకూ కేంద్రం సహకరించాలని విన్నవించారు. భద్రాచలం బోర్డర్లో ఏపీలో కలిపిన నాలుగు గ్రామ పంచాయతీలను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- **సమీకృత భూభారతి పోర్టల్‌తో తొలి అడుగు**
- **రేపటి నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు**
- **స్మార్ట్ ఫోన్‌తో ఇంటినుంచే భూ సేవల లభ్యత**
- **రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**










రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తయారు చేశామన్నారు. ఈ పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని వెల్లడించారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేరళ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి బుధవారం ఈ పోర్టల్ ప్రారంభానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేటి నుంచి ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**ఇంటి నుంచే భూ సేవలు**

గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లే పనిలేకుండా తమ ఇంటి నుంచే భూ సేవలు పొందేవిధంగా పోర్టల్‌ను రూపొందించామని మంత్రి చెప్పారు. రైతులు ఇప్పటి వరకు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరిగేవారన్నారు. ఇకపై ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి నుంచే భూభారతి పోర్టల్ ద్వారా పొందవచ్చన్నారు. రైతు లాగిన్ అయిన వెంటనే తనకు ఉన్న భూమి వివరాలు కనిపిస్తాయన్నారు. ఎన్నిఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు ఎంతచెల్లించాలో కనిపిస్తుందని చెప్పారు. ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళుతుందనీ ఆతర్వాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారని మంత్రి చెప్పారు. తర్వాత ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమేగాక సర్వేకూడా రోవర్లతో పూర్తి చేస్తారన్నారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక అది మండల సర్వేయర్ స్క్రూటినీకి వెళుతుందనీ ఆపై మండల తహశీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారైన రైతుకు ఎల్‌పిఎమ్, భూధార్ నెంబర్‌ల కేటాయింపు జరుగుతుందని పొంగులేటి అన్నారు ఈ వివరాలు భూభారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ ను జనరేట్ చేసి భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారనీ ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ ఎమ్ ఎస్ అలర్ట్స్ పంపిస్తారని చెప్పారు.

**రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జత**

భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్ (ఎల్‌పిఎమ్) యూనిక్ నెంబరు, అదేవిధంగా ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని వెల్లడించారు. ఈ ఐదు మండలాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్నతర్వాత సర్వే నిర్వహించడానికి అవసరమైన సర్వేయర్లను అందుబాటులో ఉంచామన్నారు. అలాగే గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి రోవర్లతో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. దీంతో సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని, కచ్చితమైన సర్వే వివరాలు వస్తాయని తెలిపారు. భూ సమస్యలు రైతు జీవితంలో పెద్ద అడ్డంకిగా మారాయని వాటికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ఒక కీలకమైన ముందడుగు అన్నారు. రైతు ఇంటి నుంచే అన్నిసేవలు పొందేలా పారదర్శక వ్యవస్థను తీసుకువస్తున్నామని చెప్పారు. ఇది రెవెన్యూ వ్యవస్థలో చారిత్రాత్మక మార్పునకు నాంది అవుతుందని మంత్రి పొంగులేటి అన్నారు.

# తెలంగాణపై కేంద్రం వివక్ష

- **విభజన హామీల అమలులో కేంద్రం విఫలం**
- **పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలోకేంద్రం పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఆరోపించారు. ప్రధానంగా బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లు కేటాయించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర నిర్ణయంతో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుకు మద్దతు ఇచ్చే ఉద్దేశంతోనే కేంద్రం ఈ కేటాయింపులకు అంగీకారం తెలిపిందని విమర్శించారు. బుధవారం లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మౌలిక సదుపాయాల కల్పనలోనూ తెలంగాణ పట్ల వివక్ష కొనసాగుతోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే దాదాపు 9 విమానాశ్రయాలు ఉన్నాయన్న ఆయన కొత్త విమానాశ్రయాల కేటాయింపులో తెలంగాణను విస్మరించడం సరికాదన్నారు.




# భార్యను చంపిన కేసులో ఏడేళ్లు జైలు

**ముద్ర, ఖమ్మం:**

క్షణికావేశంలో భార్యను చంపిన కేసులో భర్తకు ఏడేళ్లు జైలు శిక్షతోపాటు, రూ.5 వేలు జరిమానా విదిస్తూ 4వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి (ఫ్యామిలీ కోర్టు) అర్చన కుమారి తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి... మధ్యప్రదేశ్ రాష్ట్రం దిండోరి ప్రాంతానికి చెందిన నిందితుడు కమలేష్ మరావి (38) అతని భార్య పింకీ మాధవి మిర్చికోత పనులకు నిమిత్తం కారేపల్లి మండలం లక్ష్మీపురం, జైత్రం తండా పంచాయతీ సమీపంలో పలువురు కూలీలతో కలిసి ఉంటున్నారు. 2025 ఫిబ్రవరి 20న ఉదయాన్నే భార్యాభర్తలు గొడవపడి విచక్షణ కోల్పోయిన కమలేష్ భార్యను విపరీతంగా కొట్టడంతో మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నిందితుడిపై మోపిన అభియోగం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

# బ్యాంకులోనే మందు.. చిందు..

**ముద్ర, మోత్కూర్:**



మోత్కూరు రైతు సహకార సంఘం లిమిటెడ్ బ్యాంకులో మంగళవారం అర్ధరాత్రి ఉద్యోగులు తప్ప తాగి తందనాలు ఆడారు. అర్ధరాత్రి చైర్మన్ ఛాంబర్ లో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు, దళారులతో ఉద్యోగులు కలిసి మద్యం సేవించారు. బ్యాంకు ఉద్యోగులు దళారుల వద్ద లంచం తీసుకొని అర్ధరాత్రి లోన్లు మంజూరు చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# హైదరాబాద్ లో హై అలర్ట్

- **నేడు నగరంలో 168 హనుమాన్ శోభయాత్రలు**
- **అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల డేగకన్ను**
- **రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు**
- **మద్యం దుకాణాలు బంద్**
- **పలు చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




హనుమాన్ జయంతి సందర్భంగా నేడు హైదరాబాద్‌లో భారీ ఎత్తున హనుమాన్ శోభాయాత్రలకు నిర్వాహకులు సిద్ధం అయ్యారు. ఏకంగా 168 శోభయాత్రలతో నేడు నగరం దద్దరిల్లనుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పోలీసులు కూడా అలర్ట్ అయ్యారు. యాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఎవరైనా సరే సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల అధికారులు, హనుమాన్ శోభాయాత్ర ఉత్సవ నిర్వాహకులతో కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో సమన్వయ సమావేశం నిర్వహించిన సీపీ సజ్జనార్.. నగరంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మూడు వేల మంది పోలీసులతో నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వలంటీర్లకు సరైన ట్రైనింగ్ ఇచ్చి.. రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని ఉత్సవ నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిలు ఉన్న ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకుని.. శోభాయాత్రను చేపట్టాలని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే వాహనాల మళ్లింపులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశం తర్వాత గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్.. అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల ప్రధాన శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు.

**మద్యం దుకాణాలు బంద్:**

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నగరంలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ల పరిధిలో మద్యం దుకాణాలను పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. పౌరులు తమ ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచించారు. గౌలిగూడ రామ్ మందిర్ నుంచి ప్యారడైజ్ జంక్షన్ వరకు, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం నుంచి కోటిలోని డీఎంహెచ్ఎస్ వరకు ప్రధాన శోభాయాత్రలు సాగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కోటి, అబిడ్స్, నారాయణగూడ, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, సికింద్రాబాద్ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయి. ప్రయాణాల్లో ట్రాఫిక్ సమస్యలు ఎదురైతే తక్షణ సాయం కోసం 9010203626 నంబరును సంప్రదించవచ్చు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
02.04.2026 గురువారం, హైదరాబాద్

4 వేదిక
Peoples Voice

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# చైత్ర పౌర్ణమి హనుమాన్ జయంతి



ధర్మపురి క్షేత్రంలో హన్మాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. చైత్ర పౌర్ణమి హన్మాన్ జయంతిగా భావించ బడుతున్న ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా ధర్మపురి క్షేత్రస్థ దేవస్థానంలో సాంప్రదాయ రీతిలో స్వామి జయంతి వేడుకలను వైభ వంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఏప్రిల్ 2వ తేదీన గురువారం దేవస్థానం లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో, అలాగే గోదావరీ తీరస్థ గడ్డ హన్మాండ్ల ఆలయంలో జన్మదిన కార్యక్రమాలను నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు గావిస్తున్నారు.

**జయంతికి ఏర్పాట్లు ముమ్మరం**

ఏప్రిల్ 2న ఆంజనేయ జయంతిని పురస్కరించుకుని, 2,3,తేదీలలో ఆంజనేయ ఆలయంలో నిర్వహించ నున్న ప్రత్యేక కార్యక్రమాలలో భాగస్వాము లయ్యేందుకు సుదూర ప్రాంత హన్మాన్ దీక్షాపరులు సాంప్రదాయాచరణలో భాగంగా విచ్చేయ నున్నారు. దేవస్థానం ఏసీ ఈఓ శ్రీనివాస్, మార్గ దర్శకత్వంలో, దేవస్థాన సిబ్బంది పర్యవేక్షణలో, ఆలయ అర్చకులు వొద్దిపర్తి నర్సింహమూర్తి, కళ్యాణ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలలో భాగంగా మూడు రోజుల పాటు పంచోపనిషత్ యుక్త ప్రత్యేక పూజలు, నీరాజన, మంత్రపుష్ప, తీర్థ ప్రసాద వితరణాది కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వేలాది మంది హన్మాన్ భక్తులు 2,3 తేదీలలో హన్మాన్ దీక్షా విరమణలు చేయను నందున భక్తుల సౌకర్యార్థం త్రాగు నీటి ఏర్పాట్లు, దేవస్థానం లోనా, బయటా చలువ పందిళ్ళు, విద్యుత్ దీపాలంకరణలు, తాత్కాలిక టెంట్లు, ప్రత్యేక క్యూలైన్ల లాంటి వసతుల మెరుగుదల చర్యలు గైకొంటున్నారు. అసంఖ్యాకులైన దీక్షా. పరులు గత వారం రోజులుగా ఉదయం నుండే సుదూర ప్రాంతాల నుండి క్షేత్రానికి ఏతెంచి, పవిత్ర నదీ స్నానాలు ఆచరించి, దైవదర్శనార్థం బారులుతీరి ప్రధానాలయం ముందు వేచి ఉంటున్నారు. అలాగే క్షేత్రంలోని గోదావరీ తీరస్థ, భద్రా మరియు గోదావరీ నదుల సంగమ స్థానమైన ప్రదేశంలో, గోదావరి తీరాన్ని ఆనుకుని వెలసిన, హన్మాన్ గడ్డ పేరుతో సుపరిచిత మైన భక్తాంజనేయ దేవాలయంలో వంశపారంపర్య అర్చకులు మధ్వాచారి రాంకీషన్, పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఆంజనేయ జయంతి వేడుకలను ఏటా ఘనంగా నిర్వహించే క్రమంలో విస్తృత ఏర్పాట్లు గావిస్తున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494



# వేసవి సమస్యలు
# పిల్లలకు జాగ్రత్తలు

వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో పిల్లలను ఈ వేసవి ముగిసే వరకు అతి జాగ్రత్తగా చూసుకోవలసిన అవసరం ఉంది. వారి వయస్సు, తక్కువ రోగనిరోధక శక్తి నేపథ్యంలో వారు త్వరగా వ్యాధుల బారిన పడటం, డీ హైడ్రేషన్ కు గురికావడం జరుగుతుంది. కనుక వేసవి కాలం ముగిసే వరకు వారి పెంపకంలో పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సాధారణంగా పిల్లలు నీరు త్రాగేందుకు ఆసక్తి చూపించరు. ఇందువల్ల డీ హైడ్రేషన్ కు గురయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి తరచూ కొద్ది మోతాదులో నీరు త్రాగిస్తూ ఉండాలి. వీలైతే ఇందులో ఎలెక్ట్రోలైట్స్ పౌడర్ ను అపుడపుడు కలపటం వల్ల పోషక లవణాల కొరత నివారించవచ్చు. ఇక వేసవి వచ్చిందంటే పిల్లలు కూల్ డ్రింక్స్ తాగేందుకు ఆసక్తి చూపుతారు. కానీ చక్కెర, కెఫీన్ మోతాదు అధికంగా ఉండే వీటి జోలికి వెళ్లకుండా ఉండటమే మంచిది.

**దుస్తుల ఎంపికలో జాగ్రత్త ముఖ్యం**

వేసవిలో పిల్లలకు తేలిక, వదులుగా ఉండే దుస్తులు వేయటం మంచిది. ప్రధానంగా కాటన్, లినెన్ దుస్తులతో పాటు లైట్ రంగులున్న దుస్తులు వేయటం అన్నివిధాలా శ్రేయస్కరం. బయటకు వెళ్ళే సమయంలో తలపై ఎండ పడకుండా టోపీలు ధరించేలా చూడాలి. ఎండలో వెళ్ళాల్సిన పరిస్థితి ఎదురైతే 30 మోతాదుకు మించిన ఎస్ పి ఎఫ్ ఉన్న సన్ స్క్రీన్ లోషన్ ఎండతగిలే శరీర భాగాలకు అప్లై చేయాలి. ముఖ్యమైన పనులుంటే తప్ప ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రాకుండా చూడాల్సిన అవసరం ఉంది.

**హెల్తీ స్నాకింగ్**

వేసవి సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు పుచ్చకాయ, ద్రాక్ష, బెర్రీ వంటి పళ్ళను వాడటం ముఖ్యం. పెరుగు, మజ్జిగ, దోసకాయ ముక్కలు తరచూ వాడేలా చూడాలి. వేడిని మరింత పెంచే వేపుడు పదార్థాలు, నూనె తో చేసిన పదార్థాలు వాడకుండా ఉంటే మంచిది. తల్లిదండ్రులు సరైన జాగ్రత్తలను పిల్లలతో పాటింపజేస్తే పిల్లలకు, తల్లిదండ్రులకు సమస్యలు లేకుండా ఉంటాయి.

డా.జి.రాజశేఖర్ రెడ్డి
పిల్లల వైద్య నిపుణులు
8179450545





# ఆందోళన వద్దు అవగాహనే మందు

**ఏప్రిల్ 2 ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం**





ఎన్నిసార్లు పేరు పెట్టి పిలుస్తున్నా సరే మీ బాబు అస్సలు పలకడం లేదా? మాటిమాటికీ పలకరిస్తున్నా అతడు జవాబివ్వడం లేదా? ఎప్పుడూ తనదైన ఏదో లోకంలో ఉండి పోతున్నాడా? ఇతరులతో మాట్లాడటం, సంభాషించడం, కమ్యూనికేషన్ నెలకొల్పడంలో ఇబ్బంది పడుతున్నాడా?... ఇవి అతడు 'ఆటిజమ్' అనే రుగ్మతతో బాధపడుతున్నాడని చెప్పేందుకు కొన్ని ప్రధాన లక్షణాలు. ఈ రోజుల్లో ఈ రుగ్మత ప్రపంచ వ్యాప్తంగా చాలా విస్తృతంగా ఉంది. కొన్ని అంచనాల ప్రకారం దేశంలో దాదాపు 20 లక్షల మందికి పైగా ఆటిజమ్ బాధపడుతున్నారు. ఏప్రిల్ 2న వరల్డ్ ఆటిజమ్ డే సందర్భంగా... చిన్నారుల్లో కనిపించే ఈ వ్యాధిపై అవగాహన అవసరం.

**ఆటిజమ్ అంటే.?:**

'ఆటిజమ్' అనే మాటను మొదటిసారిగా యూజెన్ బ్లూలర్ అనే సైకియాట్రిస్ట్ ఉపయోగించారు. పిల్లలు తమదైన ఏదో లోకంలో ఉన్నట్లుగా ఉండే రుగ్మతను తొలుత స్కీజోఫ్రీనియాలోని ఒక రకంగా భావించేవారు. అయితే హాన్స్ యాస్పర్జర్, లియో కన్నెర్ అనే ఇద్దరు పరిశోధకులు ఈ వ్యాధిపై విస్తృతంగా పరిశోధించి, దీని లక్షణాలనూ, పిల్లల్లో అది వ్యక్తమయ్యే తీరును అధ్యయనం చేశారు. 'ఆటిజమ్' ఒక జబ్బు కాదు. ఒక న్యూరలాజికల్ డిజార్డర్. ఇమ్యూనిటీలో తేడా వల్ల ఇది వస్తుంది.

ఆటిజం రుగ్మత కు కారణం ముఖ్యంగా వంశపారంపర్యంగను (జన్యు), పర్యావరణ కారకాల కలయిక గా పేర్కొంటారు. ప్రమాద కారకాలలో ముఖ్యంగా తల్లి గర్భధారణ సమయంలో రుబెల్లా వంటి కొన్ని అంటువ్యాధులకు గురిఅవడం, వాల్ప్రోయిక్ ఆమ్లం, మద్యం, కొకైన్, పురుగుమందులు, సీసం, వాయు కాలుష్యం, పిండం పెరుగుదల పరిమితి, స్వయం ప్రతి రక్షక వ్యాధులు (ఆటో ఇమ్యూన్ వ్యాధులు) ఉన్నాయి. ఆటిజం, మెదడులోని సమాచార ప్రసార ప్రక్రియను ప్రభావితం చేస్తుంది నరాల కణాలు వాటి సినాప్సెస్ (సినాప్స్ అంటే నాడీ వ్యవస్థలో ఒక న్యూరాన్, లేదా నాడీ కణం) ఒక విద్యుత్ లేదా రసాయన సంకేతాన్ని మరొక న్యూరాన్‌కు లేదా లక్ష్య కణానికి పంపడానికి అనువైన ఒక నిర్మాణం) ఎలా అనుసంధానమవుతాయి, నిర్వహించబడతాయి ఇది ఎలా సంభవిస్తుందో అనే విషయంలో స్పష్టత లేదు. మానసిక రుగ్మతల డయాగ్నొస్టిక్ అండ్ స్టాటిస్టికల్ మాన్యువల్, ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ రోగ నిర్ధారణలో ఆటిజం పరిస్థితిని ఆస్పెర్గర్ సిండ్రోమ్, పిడిడి ఎన్ఓఎస్ లతో మిళితం చేసి చూస్తుంది.

అందరు పిల్లల్లా అటిజం పిల్లలు యాక్టివ్ గా ఉండరు. నలుగురి మధ్య అసలే ఉండలేరు.. ఒంటరిగా ఉండటం, బలహీనంగా కనిపించడంతో పాటు ఎప్పుడు ఏదో కోల్పోయిన వారిలాగా కనిపిస్తుంటారు. చాపకింద నీరులా విస్తరిస్తున్న ఈ మహమ్మారిని పట్టించుకుని ప్రభుత్వాలు బాల్యంలోనే చికిత్స అందిస్తే ఈ వ్యాధిని నయం చేయవచ్చు. పుట్టిన నాలుగేళ్ల వరకు అదో జబ్బు అని కూడా గుర్తించలేం.. అదే ఆటిజం (బుద్ధి మాంద్యం).. దీని కారణంగా చాలామంది చిన్న వయసులోనే శాపగ్రస్తుల్లా మారుతున్నారు. వారికి చిన్నప్పుడే వైద్య పరీక్షలు చేసి, చికిత్స అందిస్తేనే కోలుకుంటారు. కానీ దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో, చికిత్స అందిచడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా చాప కింద నీరులా విస్తరిస్తోంది. ముప్పయ్యేళ్ల క్రితం టీకాలు ముఖ్యంగా మీజిల్స్ టీకా తీసుకున్న తర్వాత కొందరు పిల్లల్లో ఎదుగుదల వెనక్కు మళ్లుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. అదే అపోహలకు దారితీస్తుంది. అయితే పెద్దఎత్తున నిర్వహించిన పరిశోధనల్లో ఇందులో నిజం లేదని తెలిసింది. టీకాలకు, ఆటిజం కు సంబంధం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థతో సహా పలు ప్రఖ్యాత వైద్య సంస్థలు నిర్వహించిన ఎన్నో అధ్యయనాలు నిరూపించాయి. గర్భిణీ తినే ఆహారం పిండం పెరుగుదల మీద ప్రభావం చూపుతుందన్న విషయం నిస్సందేహం. ఫోలేట్ వంటి పోషకాల లోపంతో మెదడు సంబంధ లోపాలు తలెత్తే అవకాశం ఉంది. మానసిక సమస్యల కోసం గర్భిణీలు వేసుకునే మందులు. పొగ, మద్యం వంటి దురలవాట్లతోనూ పిల్లల్లో కొన్ని మెదడు సంబంధం తలెత్తవచ్చు. వీటిని బట్టి చూస్తే కొందరిలో నాడీ ఎదుగుదల దెబ్బతినే ప్రమాదముంది తప్ప తల్లి తినే ఆహారానికి ఆటిజానికి ప్రత్యక్ష సంబంధమేమీలేదు. అయితే పిండం అన్ని విధాల సరిగా ఎదగడానికి మంచి పోషకాహారం తీసుకోవాలి.

ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులు.. ఇతర పిల్లలతో పోల్చుకుంటే కాస్త నెమ్మదిగా ఉంటారు. ఆలస్యంగా నేర్చుకుంటారు. ప్రపంచ వేగంతో వాళ్లు పోటీ పడలేరు. ఇలాంటి పిల్లలే తమలాంటి వారికోసం ఓ గ్రంథాలయం నడుపుతున్నారు.


గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో ఓ స్వచ్ఛంద సంస్థవారు ఆటిజం పిల్లలకోసం ప్రత్యేకంగా ఓ గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఇందులో కొన్ని పుస్తకాలు, వేల సంఖ్యలో ఫ్లాష్ కార్డులు, పిక్చర్కార్డులు అందుబాటులో పెట్టారు. ఇవి ఆటిజం పిల్లలు తేలికగా చదువుకునేలా ఉంటాయి. మరో విశేషం ఏంటంటే.. ఈ గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలు ఆటిజం పిల్లలే చూసుకుంటున్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 50 లక్షల మంది పిల్లలు 'ఆటిజం' సమస్యతో బాధపడుతున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 5 లక్షల మంది ఆటిజం బాధితులు ఉన్నారు. ఈ గణాంకాలు యేటికేడు పెరుగుతున్నా.. ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతీ ఏటా ఏప్రిల్ 2న అంతర్జాతీయ ఆటిజం డే పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఏ చర్యలు తీసుకోవడం లేదు. ప్రతీ 66 మందిలో ఒకరిద్దరు ఆటిజంతో సతమతమవుతున్నారు. ఈ సమస్య అమ్మాయిల కంటే అబ్బాయిల్లో 40 శాతం అధికంగా ఉంది. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం కింద ప్రభుత్వం 'ఆటిజం'ను అంగవైకల్యంగా గుర్తించింది. కానీ బాధితులకు మాత్రం అంగవైకల్య ధ్రువీకరణ పత్రాలను ఇవ్వడం లేదు. దీంతో బాధిత కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇటు రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యంలో ఎక్కడా దీనికి చికిత్స అందట్లేదు. ఈ జబ్బుకు వైద్యం అందించేందుకు ప్రైవేటు క్లినిక్‌లు విచ్చలవిడిగా పుట్టుకొచ్చాయి. వీటిపై సరైన నిఘా లేకపోవడంతో.. సమస్యతో వచ్చిన వారి నుంచి భారీగా ఫీజులు గుంజుతున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు చికిత్స అందించేందుకు జిల్లాల వారీగా థెరపీ సెంటర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అందించే రీయింబర్స్ మెంట్ జబ్బుల జాబితాలో కూడా ఈ జబ్బును చేర్చాలి. అన్ని ఏరియా హాస్పిటల్లల్లో వైద్యం అందేలా సౌకర్యాలు కల్పించాలి. ఈ జబ్బుపై ప్రజల్లో అవగాహన చాలా తక్కువగా ఉంది. ప్రభుత్వాలు ఈ వ్యాధిపై తల్లిదండ్రుల్లో, ప్రజల్లో విస్తృత ప్రచారం ద్వారా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ ఏడాది ఈ దినోత్సవం యొక్క థీమ్ న్యూరోడైవర్సిటీని అభివృద్ధి చేయడం మరియు UN సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్.

* సుధాకర్.ఏ.వి
* రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
* స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
* 9000674747



# దోపిడీ వ్యవస్థ మీద తిరగబడ్డ వీర కెరటం సర్వాయి పాపన్న గౌడ్



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.మూడున్నర శతాబ్దాల కింద ఆయనొక సంచలనం. ఆరడుగుల ఆజాను బాహుడు.మెలి వేసిన మీసం ఆయన పౌరుషం.తల పాగా చుట్టి ఒక చేతిలో విల్లంబు ధరించి పోరాటానికి సై అనే ధీరుడు.రాజ్యాధికారం కోసం పోరాడి సింహాసనం ని అధిష్టించిన బహుజన సింహం.అగ్రవర్ణ దోపిడి వ్యవస్థ మీద తిరుగుబాటు చేసిన ధైర్య శాలి.17 వ శతాబ్ది లోనే తెలంగాణ గడ్డ మీద పోరు వి త్త నాలు నాటిన విప్లవ కారుడు.తెలంగాణ పౌరుశమును పోత పోసుకున్న గౌడ్ సాబ్ సర్వాయి పాపన్న.ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తుత జనగాం జిల్లా రఘునాథ పల్లి మండలం ఖిలాశాపూర్ లో 1650 ఆగస్టు 18 న వీరు జన్మించారు.రాచరిక వ్యవస్థ నీడలో జమీందారులు,జాగీరుదారులు సాగిస్తూ వున్న అరాచకములను ప్రత్యక్షంగా చూడటంతో చిన్న తనం లోనే తిరుగుబాటు లక్షణం నరనరాన జీర్ణించుకుంది.ఎలాగయిన నిరంకుశత్వంని సమాధి చేయాలని అనుకున్నాడు. ప్రజల కోసం పోరు బాట పట్టారు.బహుజన వర్గాల కులాలను ఏకం చేసాడు.స్నేహితులయిన చాకలి సర్వన్న,మంగలి మాసన్న,కుమ్మరి గోవింద్,జక్కుల పెరుమాండ్లు, దూదెకుల పీరు అహ్మద్,మీర్ సాహెబ్ లతో గెరిల్లా సైన్యంను తయారు చేశారు.అగ్రకుల భూస్వాములు,వ్యాపార గడీల మీద,కోటల మీద దాడి చేసారు.సంపదను బహుజన పేదలకు పంచారు.పన్నెండు మందితో ప్రారంభం అయిన పాపన్న గౌడ్ సైన్యం పన్నెండు వేలకు చేరింది.చిన్న చిన్న సంస్థానములను ఆక్రమించి రాజ్యాన్ని విస్తరణ చేసారు.మర ఫిరంగుల నుండి అశ్వ బలం వరకు ఒక రాజ్యానికి ఉండవలసిన అన్ని రకాల సైనిక సంపత్తిని సమకూర్చారు.ఖిలాశాపూర్ లో పటిష్టమయిన కోటను కట్టించాడు.ఒక బహుజనుడు రాజ్య పాలన చేయడాన్ని అగ్ర వర్ణాలు తట్టుకోలేక పోయాయి. అగ్ర వర్ణ పెత్తందార్లుమొగల్ పాలకుల తో చేతులు కలిపారు.దీంతో 1706లో పాపన్న మీద దాడి చేసేందుకు మొగల్ సేనాని రుస్తుం ఖాన్ ప్రయత్నం చేసాడు.కాని పాపన్న బలాన్ని సరిగ్గా అంచనా వేయలేక వెనకడుగు వేశారు.1707 లో ఔరంగజేబు చనిపోయిన తర్వాత మొగల్ సింహాసనం ని బహదూర్ షా అధిష్టించటం జరిగినది .ఈ పరిణామంని అతని తమ్ముడు అయిన బీజాపూర్ సుల్తాన్ మహ్మద్ కామ్ తట్టుకోలేక తిరుగుబాటు చేసారు.ఇలా కుటుంబ గొడవల్లో మొగలులు వుండగానే వేలాది మంది సైన్యం తో పాపన్న వరంగల్ కోటను స్వాధీనం చేసుకున్నారు.పాపన్న గొప్పతనం తెలుసుకున్న బ్రిటిషు వారు మాత్రం లండన్ మ్యూజియంలో అతని ఫొటో ని పెట్టుకున్నారు.కానీ ఇప్పటి వరకు మన వాల్లు రాసిన చరిత్ర లో కనిపించదు.వీరు జన్మించిన జనగామ జిల్లాకి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లాగా నామకరణం చేయాలి.ప్రతీ జిల్లాల్లోవీరి కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలి.ఖిలాశాపూర్ గ్రామం ని పర్యాటక ప్రదేశంగా నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయాలి.వీరు ఏప్రిల్ 2.1710 లో మరణించారు వారి వర్ధంతి ని వాడ వాడల జరుపుకోవాలి.వీరి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు అధ్యయనం చేయాలి.

కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.
ఏప్రిల్ 2 న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా)..9848445134.
తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు...

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 02.04.2026
www.mudranews.in | @mudranews





ప్రకృతి అందాలు, తక్కువ నేరాలు ప్రజల సంతోషానికి కారణం. సమాజంలో సమానత్వం, విశ్వాసం ఎక్కువగా ఉంటుంది.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత ఉండొద్దు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అలంపూర్ తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు అధిక ధరలు చెల్లించి ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఇసుక కొనుగోలు చేయవద్దని, ప్రభుత్వం నుంచి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసేలా లబ్ధిదారులకు సహకరించాలన్నారు. అనం తరం అలంపూర్ మున్సిపల్ కార్మికులు తమకు పెండింగ్ లో ఉన్న జీతాలను ఇప్పించాలని కలెక్టర్ ను కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అలంపూర్ లోని నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తనిఖీ చేశారు. వార్డులో తిరుగుతూ పలువురు రోగులు, సహాయకులతో మాట్లాడారు. అనంతరం బాల బ్రహ్మేశ్వర స్వామి, జోగులాంబ



అమ్మవారిని కలెక్టర్ దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలను పెద్ద ఎత్తున పెంచి పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి విమల, తహసిలారు ప్రభాకర్, ఎంపీడీవో పద్మావతి, మున్సిపల్ కమిషనర్ శంకర్ పాల్గొన్నారు.

**గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి**

ఏప్రిల్ రెండున నిర్వహించే గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని అధికారులతో కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. లైన్ డిపార్ట్మెంట్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొనేలా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కొత్త పథకాలు, చేపట్టిన ఆయా అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కొంతమంది లబ్ధిదారులతో సభల్లో మాట్లాడించాలని, ఆయా పథకాలపై వారి అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు వంటి సామాజిక సమస్యలపై కూడా చర్చించాలన్నారు. వేసవిలో జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని, చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఎల్లవేళలా ముందుండాలని, తాము కూడా ఏ సమస్య వచ్చిన పరిష్కరించేందుకు సహకరిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఈఓడబ్ల్యు థాణాను ప్రారంభించిన సీపీ



**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో నేరెడ్మెట్‌లోని పోలీస్ క్వార్టర్స్‌లో ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీస్ స్టేషన్‌ను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ప్రారంభించారు. రోడ్డు భద్రత డీసీపీ కె. మనోహర్, ఈఓ డబ్ల్యు పోలీస్ స్టేషన్‌ను పర్యవేక్షించనున్నారు. ఆయనతో పాటు ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు పి. సత్తయ్య, ఎన్.అంజయ్య, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు కె. భాస్కర్, ఎ. సూర్యనాయక్, కె. రవికుమార్ సేవలు అందించనున్నారు. ఈ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ ప్రధానంగా ఆర్థిక మోసాల కేసులను విచారిస్తుంది. రూ. 2 కోట్లకు పైబడిన మోసాలు, నమ్మకద్రోహం, నకిలీ పత్రాల సృష్టి వంటి కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది. అలాగే తెలంగాణ స్టేట్ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, 1999 (2023 సవరణ) కింద రూ. 1 కోటి పైబడిన కేసులను కూడా పరిశీలిస్తుంది.అదనంగా, కమిషనర్ ఆదేశాల మేరకు ఇతర ఆర్థిక నేరాలను కూడా విచారించనుంది.

## చికెన్ షాపులు బంద్ విజయవంతం

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చికెన్ వ్యాపారాలు ముకుమ్మడిగా బంద్ చేశారు. స్నేహ కంపెనీ మరియు వివిఎస్ఆర్ కంపెనీలు పూర్తి మద్దతు ప్రకటించారు. చికెన్ సెంటర్ నిర్వాహకులకు సరైన మార్జిన్ కల్పించే విధంగా ధరలపై స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని వారు కోరుతున్నారు. ఈ బంద్‌ను మరో మూడు నుంచి నాలుగు రోజుల పాటు కొనసాగించే యోచనలో ఉన్నట్లు సంఘం అధ్యక్షుడు సుభాష్, కార్యదర్శి జంగిర్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పౌల్ట్రీ కంపెనీలు, ఫార్మర్లు అందరూ కలిసి సరైన ధరను నిర్ణయించి అధికారికంగా ప్రకటిస్తే సమస్య పరిష్కారమవుతుందని వ్యాపారులు అభిప్రాయపడ్డారు.

**గద్వాలలో..**

**ముద్ర,గద్వాల:** జిల్లా చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గద్వాల జిల్లా కేంద్రంలో చికెన్ షాపులను బంద్ చేసి ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. గతంలో 1.8 గా ఉన్న మార్జిన్ ప్రస్తుతం 1.5కి తగ్గించడమే ఈ బంద్కు ప్రధాన కారణమని వారు పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్ లో జరిగే ధర్నాకు షాప్స్ యజమానులు తరలివెళ్లారు.

## ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** శ్రీపురం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. గీతాంజలి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ హాజరయ్యారు. గౌరవ అతిథులుగా వెన్నెల సాహితీ సంస్థ ప్రతినిధి ముచ్చర్ల దినకర్, డా. స్వరూపరాణి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకుడు డా. రాత్లవత్ కృష్ణ రచించిన "తెలంగాణలో మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత" పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అలాగే ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థుల కోసం ఉచిత సమ్మర్




ఇంటర్న్‌షిప్ కార్యక్రమం, కొత్తగా ప్రవేశ పెట్టిన బి.కాం బిఎఫ్ఎస్ఐ (ఎఈపిడి) కోర్సుకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి కూడా అత్యవసరమని వక్తలు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులకు అవార్డులు, క్రీడా పతకాలు, అధ్యాపకులకు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. చివరిగా విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి.

## అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిషేధం

**ఎస్పీ సునిత రెడ్డి**



**ముద్ర, వనపర్తి:** జిల్లాలో ఏప్రిల్ 30 వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. జిల్లా పరిధిలో ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎవరైనా ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, భారీ స్థాయి సమావేశాలు నిర్వహించడం నిషేధం అని ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా చోటు లేదు అని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ప్రజల భద్రత కోసం పెట్టబడ్డాయని, ప్రజలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఏ కార్యక్రమం కావాలన్నా ముందుగానే దరఖాస్తు చేసి అనుమతి పొందాలని. ప్రజల సహకారం వల్లనే శాంతి భద్రతలు నిలుస్తాయని అన్నారు. పోలీసుల చర్యలు ప్రజల రక్షణ కోసమేనని తెలిపారు.

## నేడు జిల్లాలో రాష్ట్ర మంత్రుల పర్యటన

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో గురువారం రాష్ట్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా మంత్రులు అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని పదర మండలం మద్దిమడుగు గ్రామానికి చేరుకుని, ప్రసిద్ధ మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి దర్శనం చేసుకోనున్నారు. అనంతరం అక్కడే అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నారు.

## వైద్య శిబిరాలపై డీఎంహెచ్ఓ తనిఖీ




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న స్పెషాలిటీ వైద్య శిబిరాలను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. రవి కుమార్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల నమోదు విధానం, చికిత్స వివరాలు, మందుల పంపిణీ, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. వైద్య సేవలు పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. ప్రజలకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది మరింత బాధ్యతతో పనిచేయాలని ఆయన సూచించారు.


## అత్యంత వైభవంగా శ్రీ మహాలక్ష్మి యాగం

**ముద్ర, కూకట్‌పల్లి:** చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో శ్రీ మహాలక్ష్మి యాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ మహాలక్ష్మి యాగ సమితి ఆధ్వర్యంలో, వడ్డేపల్లి రాజేశ్వరరావు-యామిని దంపతుల సౌజన్యంతో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం పండితుల ఆధ్వర్యంలో ప్రవేశ బలి, లక్ష్మీనరసింహారాధన, గోపూజ, లక్ష్మీ నారాయణ పూజ, శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించారు. రఘు



గురూజీ, నాగేశ్వరావు, హనుమంతరావు, ఆండాలమ్మ, అశోక్ యాదవ్, గొట్టిముక్కల భాస్కరరావు, మాధవరం నాగేష్ మహిళలు, భక్తులు పాల్గొన్నారు

## కళ్యాణం.. కమనీయం



**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో గల శ్రీ పబ్బతి హనుమాన్ దేవాలయంలో చైత్ర పౌర్ణమి, ఉత్తరా నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రదోషకాలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మాడభూషి అజయ్ కుమార్ శర్మన్ కందాడై శ్రీనివాసాచార్యుల నేతృత్వంలోని సంప్రదాయ కళ్యాణ క్రతువులను నిర్వహించారు. భాస్కర్ రెడ్డి స్వీట్ హౌస్ వారు సేవలందించారు. జిల్లా ఎస్ఈ నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్ పాల్గొన్నారు.

## యాంత్రిక వ్యవసాయం ద్వారా అధిక లాభాలు

**ముద్ర, గద్వాల:** యాంత్రిక వ్యవసాయం ద్వారా అధిక లాభాలు రావచ్చునని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల నియోజకవర్గ పరిధిలోని రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 50 శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను బుధవారం అర్హులైన 16 మంది లబ్ధిదారులకు పంపిణి చేసి మాట్లాడారు. గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఏడీఏ సంగీత లక్ష్మీ, గట్టు, గద్వాల, ధరూర్ ,కేటిదొడ్డి మండలాల వ్యవసాయ అధికారులు, మాజీ జెడ్పీ చైర్మన్ బండారు భాస్కర్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్



జంబు రామన్ గౌడ, నాయకులు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచులు శివ, పవన్ కుమార్ రెడ్డి, విజేయులు నాయకులు ఉరుకుందు, రామయ్య శెట్టి, యుగేందర్ గౌడ్, గోవిందు, శేఖర్ రెడ్డి తిమ్మారెడ్డి, శేఖర్ రెడ్డి, సిల్వర్ రోటవేటర్ డిస్ట్రిబ్యూటర్ దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'పంగుని ఉత్తిరం'

**ముద్ర, కూకట్‌పల్లి :**
తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అత్యంత వైభవంగా జరుపుకునే అయ్యప్ప స్వామి జయంతి (పంగుని ఉత్తిరం) వేడుకలు బుధవారం కూకట్‌పల్లిలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. దేవస్థానం చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వామివారికి నిర్వహించిన అభిషేకం, అర్చన, హారతుల్లో ఆయన పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి జయంతి ఉత్సవాలు

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో శ్రీ అయ్యప్ప స్వామి జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సుందర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించగా, ఆలయ ప్రధాన పూజారి గవ్వమఠం విజయ శాస్త్రి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పడిపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు సుందర్, తీగల శేఖర్, జగన్ పవిత్ర పడిని వెలిగించారు. కార్యక్రమంలో అనిల్, మురళి, శేఖర్, ప్రవీణ్, యాదగిరి, సురేష్



గురుస్వాములు పాల్గొన్నారు. అనంతరం ప్రధాన పూజారి భక్తులకు ఆశీర్వచనాలు అందించగా, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

## హనుమాన్ జయంతి వేడుకకు చీకోటి

**ముద్ర, నారాయణపేట:** జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వీర హనుమాన్ శోభా యాత్రకు ముఖ్య అతిథిగా చికోటి ప్రవీణ్, మదన్ గుప్తా హాజరవుతున్నట్లు విశ్వ హిందూ పరిషత్ బజరంగ్దళ్ నాయకులు కన్న శివకుమార్, ప్రవీణ్, శ్రవణ్, ప్రకాష్ భట్టాడ్, సందీప్ తెలిపారు. శోభాయాత్ర అనంతరం గొడుగు గేరీ హనుమాన్ మందిరం వద్ద సభ ఉంటుందన్నారు. కాషాయ ధ్వజాలతో ర్యాలీకి రావాలన్నారు.

## కొలువుదీరిన రేణుక ఎల్లమ్మ దేవాలయ నూతన పాలకవర్గం




**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలోని కొత్లాపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాండూర్ శాసనసభ్యులు మనోహర్ రెడ్డి. దేవాలయ కమిటీ చైర్మన్ గా ప్రవీణ్ రెడ్డి, పాలకవర్గ సభ్యులుగా ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు తోడ్పాటునందిస్తానని ఆయన తెలిపారు. అలాగే ప్రభుత్వ వెబ్ సైట్లో ఈ దేవాలయాన్ని చేర్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఆలయ అభివృద్ధి కొరకు నూతన పాలకవర్గం కృషిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చంద్రకళ, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు రవి గౌడ్, పట్లోళ్ల బాల్రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నరసింహులు, మాజీ దేవాలయ చైర్మన్ బసిరెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

**పొట్లీ మహారాజ్ దేవాలయ అభివృద్ధికి కృషి**

తాండూర్ పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన పొట్లీ మహారాజ్ దేవాలయం అభివృద్ధికి తన వంతు చేరితనందిస్తానని తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. దేవాలయ ప్రాంగణంలో రాజగోపురం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్ల నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, కౌన్సిలర్లు, దేవాలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## భగీరథ నల్లాలకు ట్యాప్‌లు కరువు



**ముద్ర, గద్వాల:** మల్దకల్ మండల పరిధిలో తాటికుంట గ్రామంలో మిషన్‌భగీరథ నల్లాకు ట్యాప్ పెట్టకుండానే అధికారులు వదిలేయడంతో నల్లా నుంచి నీరు వృథాగా పోతుంది. ఉదయం, రాత్రి తేడా లేకుండా తాగునీరు నేల పాలవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నల్లా కనెక్షన్లకు ఆన్‌ఆఫ్‌లను వెంటనే అమర్చి నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సలేశ్వరం జాతరకు ఏర్పాట్లు పూర్తి



**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్ :** అచ్చంపేట నియోజకవర్గంలో తెలంగాణ అమర్నాథ్‌గా ప్రసిద్ధి చెందిన సలేశ్వరం జాతర ప్రారంభానికి సిద్ధమైంది. పౌర్ణమి సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు అధికారులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ జాతరకు తెలంగాణ తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడం తో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. జాతర ప్రాంత మంతా చెక్‌పోస్టుల వద్ద తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేయడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నిరంతర నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. జాతర ముగిసే వరకు నీటి కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీఈ హేమలత తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఈ లలిత, ఏఈలు మధు, సాయి, అక్బర్, సందీప్, హరినాథ్‌తో పాటు సిబ్బంది రాజేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ముద్ర, కాప్రా:** కల్యాణ లక్ష్మి ,షాది ముభారక్ చెక్కులు పంపిణీ పారదర్శకంగా జరగాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలి ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు.ఉప్పల్ మునిసిపల్ కార్యాలయంలో 172 మందికి కల్యాణ లక్ష్మి ,షాది ముభారక్ చెక్కులను లబ్దిదారులకు చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలందరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు ,పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన




**ముద్ర, కాప్రా:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ బుధవారం ఏఐటీయూసీ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని అంబేద్కర్ కూడలి వద్ద "బ్లాక్ డే"గా పాటిస్తూ, ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వియస్. బోస్ మాట్లాడుతూ లేబర్ కోడ్లు కార్మికవర్గంపై దాడి అని, కార్మిక హక్కుల అపహరణ అని అన్నారు. కార్మిక హక్కులను రక్షించుకోవడం కోసం ప్రతి కార్మికుడు ఈ పోరాటంలో భాగస్వామి కావాలని పిలుపునిస్తున్నామన్నారు. పని గంటల పెంపు – శ్రమ దోపిడీ పెరుగుదల కొత్త కోడ్ల ద్వారా పని గంటలను పెంచే అవకాశం ఉందన్నారు. ఇది కార్మికుల ఆరోగ్యం, జీవన నాణ్యతను దెబ్బతీస్తుందని, ఉద్యోగ భద్రత లేకపోవడం 300 మందికి లోపల ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ప్రభుత్వం అనుమతి లేకుండా ఉద్యోగాలను తొలగించే స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా ఉద్యోగ భద్రత పూర్తిగా నశిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఎస్. శంకర్ రావు,ఏఐటీయూసీ నేతలు నారా నర్సింహా, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

## నేడు హనుమాన్ శోభాయాత్ర

**ముద్ర, మల్కాజిగిరి:** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం నిర్వహించనున్న "శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర" దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శోభా యాత్ర ఉదయం 11:30 గంటలకు గౌలిగూడ రామ్ మందిర్ నుంచి ప్రారంభమై, రాత్రి 8:00 గంటలకు తడ్బండ్ శ్రీ హనుమాన్ దేవాలయానికి చేరుకుంటుంది. ఈ యాత్ర సుమారు 12 కిలోమీటర్ల మేర సాగుతుంది, ఇందులో 2 కిలోమీటర్ల మేర మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి వస్తుంది. కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం వంటి వివిధ ప్రాంతాల నుంచి 14 ఉప యాత్రలు ప్రధాన ర్యాలీలో కలుస్తాయి. ఇవి కాకుండా కమిషనరేట్ వ్యాప్తంగా మరో 92 స్థానిక ఊరేగింపులు జరగనున్నాయి. యాత్ర సాగే సమయంలో ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించడం లేదా మళ్లించడం జరుగుతుంది. భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, సరుకు రవాణా వాహనాలపై ప్రత్యేక ఆంక్షలు ఉంటాయి. ఊరేగింపు సాగే మార్గాల్లో ఎటువంటి పార్కింగ్‌ను అనుమతించరని, ట్రాఫిక్ నిబంధనలకు ప్రజలు సహకరించాలని మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీ కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 02.04.2026
www.mudranews.in | @mudranews



**స్వీడన్**



వర్క్-లైఫ్ బ్యాలెన్స్, ఆరోగ్య సేవలు మంచి స్థాయిలో ఉం టాయి.ప్రజల మధ్య సమానత్వం, భద్రత ఎక్కువగా ఉంటుంది.

# వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ్యం

**- తల్లిదండ్రులు అంటే భయం ఉండేందుకే కొత్త చట్టం..**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, జగిత్యాల:**
వృద్ధుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయ మని వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ లో బుధవారం రాష్ట్ర ఉద్యోగుల తల్లిదం డ్రుల సంరక్షణ – పర్యవేక్షణ చట్టంపై అవ గాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్ జెండర్స్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతి థిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కొంత మంది తమ తల్లిదండ్రుల పోషణ మరచి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీం తో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని తెలిపారు. అలాంటి వారి కోసం తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల సంర క్షణ– పర్యవేక్షణ చట్టం తెచ్చామని పేర్కొ న్నారు. తల్లిదండ్రులు పోషణ, పరిరక్షణ పట్టించుకోని కొడుకులకు భయం, భక్తి ఉండటానికి కొత్త చట్టం తెచ్చామని చెప్పా రు. ఈ చట్టం ప్రకారం బాధిత తల్లి దండ్రులు కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తే, 60 రోజుల్లో విచారణ జరిపి న్యాయం చేస్తారని పేర్కొన్నారు. కొత్త చట్టం ప్రభుత్వ ఉద్యో గులతో పాటు ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు సైతం వర్తిస్తుందని స్పష్టం చేశారు. అసెం బ్లీలో, మండలిలో ఈ బిల్లు ప్రవేశ పెట్ట డానికి తనకు అవకాశం రావడం సంతో షంగా భావిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అనేక రకాలుగా ఆలో చన చేసి ఈ చట్టం తెచ్చారన్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. కొత్త చట్టాన్ని అమలు చేయడానికి పోలీసుల సహకారం తీసుకో వాలని సూచించారు. చట్టం అమలుపై డీజీపీతో పాటు జిల్లా పోలీసు అధికారులకు తాను లేఖ రాస్తానని మంత్రి తెలిపారు.

**దేశంలో ఎక్కడా లేని చట్టం..**

వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైల జ మాట్లాడుతూ రాష్ట్రంలో తెచ్చిన తెలం గాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ – జవాబుదారీతనం, పర్యవేక్షణ చట్టం దేశం లో ఎక్కడ లేదన్నారు. అస్సాంలో ఉన్న చ ట్టం కంటే మననే పదునైన చట్టమని పేర్కొ న్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు రిజి స్టర్ అయిన ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు సైతం చట్టం వర్తిస్తుందని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 32 లక్షల మంది వయోవృద్ధులు ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం వీరి సంఖ్య 48 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. బాధిత తల్లిదం డ్రుల ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక ఆఫిలెట్ అధికారిని నియమించమ న్నారు. ఉద్యోగులతో పాటు ప్రజాప్రతి నిధులు సైతం చట్టం పరిధిలోకి వస్తార న్నారు. ఈ సమావేశంలో కలె క్టర్ సత్య ప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ పాల్గొన్నారు.

## ఖానాపూర్ చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు చేయాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ లో వాయిదా ప డ్డ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్ని కలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఈ నెల 4న జరగనున్న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఏర్పాట్లపై సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్ని కను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వ హించాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ట్రాఫిక్, పార్కిం గ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్య లు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమా వేశంలో సీపీవో జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**కోరుట్ల, ముద్ర:**
హనుమాన్ దీక్షాపరులు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు కోరారు. బుధవారం పట్టణంలోని శ్రీదుర్గా మెస్ వద్ద కొండగట్టుకు పాద యాత్ర చేస్తున్న హనుమాన్ దీక్ష భక్తులకు నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తమ చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇరవై ఐదేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలి పారు. ఎంతో మంది పేదలను ఆదుకున్నా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, కౌన్సిలర్ బొడ్ల ఆనంద్, మద్రి నర్సయ్య, కొయ్యల లక్ష్మణ్, ధర్మేందర్, దోమకొండ రమేష్, గన్నారపు వేణు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు పరిహారం అందజేస్తాం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, గొల్లపల్లి:**
ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అంద జేస్తామని సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మం డలం భీమరాజు పల్లిలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంత్రి వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో జిల్లాలో 6,160 ఎకరాల్లో మామిడి పంట, 1,029 ఎకరాల్లో వరి, 1,520 ఎకరాల్లో మొక్కజొన్న, 581 ఎక రాల్లో నువ్వు పంటలు దెబ్బ తిన్నట్టు అధి కారులు ప్రాథమిక అంచనా వేశారని తెలి పారు. దెబ్బతిన్న పంటలకు యుద్ధ ప్రాతి పాదికన అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పంటలు న ష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లిం చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అధికారులు నివేదన త్వరగా తయారు చేయాలని తెలిపారు. పెట్టుబడులు పూర్త యి పంట చేతికి వచ్చే సమయంలో ఇలా నష్టపోవడం బాధా కరమన్నారు.

**అర్హులందరికీ రేషన్ కార్డులిచ్చాం..**

రాష్ట్రంలోని అర్హులందరికీ రేషన్ కార్డు లు అందజేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని న ల్లగుట్టలో నూతన రేషన్ స్టాక్ పాయింట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా గొల్ల పల్లి మండల కేంద్రంలోని సమస్యలు పరి ష్కారిస్తానని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నల్లగుట్టలో నూతన రేషన్ షాప్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. త్వరలోనే బయోమెట్రిక్ ద్వారా పూర్తి స్థాయి రేషన్ దుకాణం ఏర్పాటు చేస్తా మని తెలిపారు. ఆర్థిక పరమైన ఇబ్బం దులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పేదలు నా ణ్యమైన బియ్యం తినాలని ఆలోచనతో రేష న్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తు న్నట్లు పేర్కొన్నారు. గొల్లపల్లిలో యువత కోసం స్టేడియం నిర్మిస్తామన్నారు. శ్మ శాన వాటిక రోడ్డు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నిలిచిపోయిన సెంట్రల్ లై టింగ్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

# మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

**- జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే సత్యం**



**ముద్ర, కరీంనగర్ :**
మహనీయుల జయంతి ఉత్సవాలను ఘ నంగా నిర్వహిద్దామని చొప్పదండి ఎమ్మె ల్యే, బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. ఈ నెల 5 న మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్, 14వ భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను మును పెన్నడూ జర గని విధంగా కరీంనగర్ లో అత్యంత వైభ వంగా జరుపుకుందామని పేర్కొన్నారు. మహ నీయుల జయంతి ఉత్సవాల నిర్వ హణలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా కృషి చేద్దామన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జయంతోత్సవాల నిర్వహణపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అ ధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీ స్ కమిషనర్ గౌష్ ఆలం, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్ తో పాటు పలువురు అధిరులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మేడిపల్లి స త్యం మాట్లాడుతూ మహనీయుల విగ్రహాల వద్ద అధికారులు అన్ని రకాల సదుపా యా లు సౌకర్యాలు కల్పించాలని సూచిం చారు. కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ మహ నీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకునే మంచి అవకాశం వచ్చిందని తెలిపారు. ఉత్సవాలకు హాజరయ్యే ప్రజలు కుల సంఘాల ప్రతినిధులు అందరికీ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుం టామన్నారు. 2న జరిగే గ్రామ సభల్లో జయంతి ఉత్సవాల విజయవంతం పై ప్రజ లందరికీ అధికారులు అవగాహన కల్పి స్తారని తెలిపారు. పలువురు దళిత సం ఘాల నాయకులు జయంతి ఉత్సవాల నిర్వ హణపై మాట్లాడారు. పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పోలీస్ కమిష నర్ గౌష్ ఆలం, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ హుజురాబాద్ ఆర్డీవోలు కే మహేశ్వర్ రమేష్ బాబు కరీం నగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్చార్జి డిప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ వై తిరుపతిరావు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలు



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో బుధ వారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వందేళ్లు జీవించాలని కోరారు. భవి ష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, అడ్వాల జ్యోతి లక్ష్మణ్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, నాయకులు పాల్గొన్నారు.

## ఆధునిక పనిముట్లతో రైతులకు మేలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** వ్యవసాయ పనుల్లో ఆధునిక పనిముట్ల వాడకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం జిల్లాలోని సారంగాపూర్ మండలం కౌట్ల (బి) రైతు సంఘానికి రూ.3.85 లక్షల సబ్సిడీతో మంజూరైన డ్రోన్, పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పనుల్లో ఆధునిక యంత్రాల వాడకం వల్ల వ్యవసాయం లాభసాటిగా మారుతుందని పేర్కొన్నారు. ఆధునిక పనిముట్లతో పనులు తక్కువ శ్రమతో తొందరగా పూర్తవుతాయని చెప్పారు. దీంతో రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. మరింతమంది రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**గ్రామ, వార్డు సభలు నిర్వహించాలి..**

ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం గ్రామీ ణ, పట్టణ ప్రాంతాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లాలో కొనసాగుతున్న ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సం ద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా వార్డులు, గ్రామాల్లో నిర్వహించే సభలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిం చాల న్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీజీఓ జీవరత్నం పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం



**కోరుట్ల, ముద్ర:** పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నామని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు తెలిపారు. కోరుట్ల పట్టణంలోని 17వ వార్డు గంగం పేట్ లో మండ జ్యోతి ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో ఆయన పా ల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన విధానంతో ప్రతి పేదవాడి సొంతింటి కల నెర వేర్చారని తెలిపారు. అనంతరం ఇంటి యజమాని మండ జ్యోతి కాంగ్రెస్ నాయ కుడు జువ్వాడి నర్సింగరావు,కౌన్సిలర్ సోగ్రబి అక్బర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగా ధర్, వైస్ చైర్మన్ షాహిద్, విజయ్, సమిద్, తబ్రేజ్, రమేష్, రాములు, శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



**కోరుట్ల, ముద్ర:** వార్డులోని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఆరో వార్డు కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి తన వార్డులో ప్రజల సమస్యల పరిష్కారం కోసం కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జువ్వాడి నర్సింగరావు, తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్ ఉల్ అహ్మద్ ను సన్మానించారు. కౌన్సిలర్లు రెంజర్ల కళ్యాణి, కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 02-04-2026
www.mudranews.in | @mudranews



నెదర్లాండ్స్
సైక్లింగ్ కల్చర్, స్వేచ్ఛా జీవనం ప్రజలకు సంతోషాన్ని ఇస్తుంది. ఆర్థిక స్థిరత్వం, మంచి సామాజిక సేవలు ఉన్నాయి.



## బడుగు, బలహీన వర్గాల కోసం పోరాటం

**▸▸ సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి**



ముద్ర, మోత్కూరు:

బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. సీపీఐ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మోత్కూరు పట్టణ కేంద్రంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవడానికి ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అనేపు వెంకట్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జంగ నర్సయ్య, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి గొలుసుల యాదగిరి, బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు పెండెం వెంకటేశ్వర్లు, నిలిగొండ అశోక్, మానుపాటి సాయిలు, పంగ యాదగిరి, గంగాదేవి చంద్రయ్య, నిలిగొండ రాములు, మహిళా సంఘం పట్టణ అధ్యక్షుడు నల్ల పుష్పమ్మ, జంగ జాంగిర్, గొలుసుల పిచ్చమ్మ, నిలిగొండ అండాలు, జంగ సైదమ్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఫైళ్లన్నీ ఈ-ఆఫీస్ ద్వారానే..

**▸▸ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

ప్రభుత్వ కార్యకలాపాల ఫైళ్లకు ఆన్లైన్ లోనే వేగంగా పరిష్కారం చూపడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో అన్ని శాఖల జిల్లా అధికారులతో ఈ-ఆఫీస్ నిర్వహణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలనలో మరింత వేగం, పారదర్శకత, పర్యవేక్షణ పెంచేందుకు అన్ని ప్రభుత్వ శాఖల్లో కార్యకలాపాలు ఆన్లైన్లోనే జరగాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఏప్రిల్' 1 (నేటి) నుండి అన్ని శాఖల్లో ప్రతి ఫైలును ఆన్లైన్లోనే నిర్వహించాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి విభాగం నుండి సాధారణ పరిపాలన వరకు అన్ని ఈ-ఆఫీస్ ద్వారానే ఫైళ్ల పరిష్కారం జరుగుతాయని అన్నారు. కలెక్టరేట్లోని ఏ.బి.సి.డి.ఈ. తదితర సెక్షన్ లోని అధికారులు సాధారణ పరిపాలనతో పాటు రెవెన్యూ, లా అండ్ ఆర్డర్, భూ సేకరణ, ప్రభుత్వ భూములు, కోర్టు కేసులు, సంక్షే మ పథకాలు, ప్రభుత్వ శాఖలో సంబంధిత ఉద్యోగుల పేరుతోనే మెయిల్ ఐడి క్రియేట్ అవుతుందన్నారు. మెయిల్ ఐడి తోనే అధికారుల అన్ని విధులు ఆన్లైన్లో కొనసాగించాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు టోకెన్లు ఇవ్వడం జరిగిందని ఇకనుండి టోకెన్ల ద్వారానే ఈ సైన్ ద్వారానే ఫైళ్ళ పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఈ ఆఫీస్ నిర్వహణపై అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ సాయికుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జయమ్మ, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సకాలంలో అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం మినీ మీటింగ్ హాల్ లో డిఐపిసి, టీజీ ఐపాస్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీజీ-ఐ పాస్ కి సంబంధించిన వివిధ శాఖలను కలెక్టర్ సమీక్షిస్తూ అధికారులందరూ నిర్ణీత కడుపులోగా ఆమోద నిబంధనలను చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన సబ్సిడీ దరఖాస్తులు, పరిశ్రమలకు కావాల్సిన ముడి సరుకులు (కోల్, ఆల్కహాల్) సిఫారసు చేయడానికి ఆమోదించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రవీందర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పిసిబి వెంకన్న, జిల్లా మైన్స్ అధికారి రవికుమార్, ఫ్యాక్టరీస్ అధికారి జంగయ్య, ట్రాన్స్పోర్ట్ అధికారి సాయికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

### వన మహోత్సవం విజయవంతం చేయాలి

వన మహోత్సవాన్ని అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం మినీ మీటింగ్ హాల్ లో డిఎఫ్ఓ సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం లో స్థానిక సంస్థ ల జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు లతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 16.72లక్షలు మొక్కలు నాటాలన్నారు. 2026 జూన్ మాసంతంలోగా ప్లాంటేషన్ లకు సంబంధించిన ప్రదేశాలను గుర్తించి, జులైలో మొక్కలు నాటుటకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణా రెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి అధికారులు, వివిధ జిల్లా అధికారులు మరియు మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడిపూజ



ముద్ర, మోత్కూర్:

మోత్కూర్ మండలంలోని ముషిపట్ల గ్రామంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి గుట్టపైన ఉన్న హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం పడి పూజను నిర్వహించారు. అయ్యస్వామి జన్మ దినోత్సవం పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్న ప్రసాదం అందించారు. పూజా కార్యక్రమాలను పురోహితులు మోత్కూర్ ప్రదీప్ శర్మ, మోత్కూర్ సందీప్ శర్మ, హర్షవర్ధన్ శర్మ లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫైళ్ల నర్సిరెడ్డి, ఉప సర్పంచ్ అంజయ్య, బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ ఛైర్మన్ మడిగే శేఖర్, అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తుల తయారీలో నాణ్యత పాటించాలి

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందించే ఏకరూప దుస్తులను పకడ్బందీగా కుట్టాలని డీఈవో కందుల సత్యనారాయణ అన్నారు. బుధవారం భువనగిరిలో ఉన్న విదిత కుట్టు శిక్షణా కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెసరు లింగా రెడ్డి, డిఆర్డిఏ జిల్లా ఏ.పీ.ఎం.పసునూరి రమణ పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తుందని తెలంగాణ భవన్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భువనగిరిలోని జగదేవ్పూర్ చౌరస్తా వద్ద భవన నిర్మాణ కార్మికులతో కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నూతన చట్టాలును అమలు చేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాయ కృష్ణ, పట్టణ కార్యదర్శి గంధ మల్ల మాతయ్య, నాయకులు బాలయ్య, ఎల్లయ్య, యుగేందర్, అమరేందర్, రాములు, లక్ష్మి, కవిత, అండాలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో అవకతవకలకు పాల్పడితే చర్యలు

**▸▸ రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

యాసంగి 2025-26 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, సంబంధిత అధికారులతో వరి కొనుగోలు సన్నాహక సమావేశంలో అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ధాన్యం సేకరణ వివరాలను వ్యవసాయ శాఖ ద్వారా స్వీకరించి కేంద్రాలకు వచ్చే దాన్యం పూర్తి వివరాలు డాటా ఎంట్రీ లో పొందుపరచాలన్నారు. వరి ధాన్యం క్వింటాలు ' ఏ ' గ్రేడ్ కు రూ.2389, సాధారణ రకం క్వింటాల్ రూ.2369 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారిని రోజారాణి, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ హరికృష్ణ, డీఆఓ నాగిరెడ్డి, డిసిఓ మురళి, డీఏఓ రమణా రెడ్డి పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

ముద్ర, మోత్కూర్:



మోత్కూరు మండలం దత్తప్ప గూడెంకు చెందిన ఏనుగుల మత్స్యగిరి తల్లి పద్మకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రూ.43 వేల చెక్కును 5వ వార్డు సభ్యుడు వంగూరి శ్రీకాంత్ బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ ఎస్ కె సాజిద్ పాషా,ఎలుగు కోటి లింగం, దేవసరి రాములు, వలపు యాదయ్య, కుటుంబ సభ్యులు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణా కేంద్రాన్ని పరిశీలించిన సీఎంఓ

ముద్ర, మోత్కూర్:



మోత్కూరులో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీపీసీ ఏకరూప దుస్తుల కుట్టు శిక్షణా కేంద్రాన్ని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెసరు లింగారెడ్డి బుధవారం పరిశీలించారు. శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు తమ స్వంత పిల్లలకు దుస్తులు తయారు చేసిన విధంగా భావిస్తూ, నాణ్యమైన వాటిని అందించాలనీ ఆన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ జిల్లా ఏపీఎం పసునూరి రమణ, శిక్షణా కేంద్రం ఇంచార్జి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం

ముద్ర ప్రతినిధి, కోదాడ:



కోదాడ మున్సిపాలిటీ పరిధిలో సిపిఎస్ స్కూల్ నందు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం 32, 34, 35 వార్డుల కౌన్సిలర్లు పాశం శ్రీనివాసరావు, పందిపోటు స్వప్న, పార సత్యవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని , నిరుపేదలకు సన్న బియ్యం ఇస్తుందని, ముందు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారామహిళలతో పాటు ప్రతి ఆడబిడ్డ లబ్ధి పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు శ్రీలత , సునీత , ధనమ్మ తో పాటు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నెలాఖరు వరకు ఎస్సారెస్పీ నీరు విడుదల చేయాలి

ముద్ర, తుంగతుర్తి:

ఎస్సారెస్పీ జలాలను ఏప్రిల్ నెలాఖరు వరకు విడుదల చేయాలని తహసీల్దార్ కు బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మెమొరాండం అందించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నీటి విడుదల ఆలస్యంగా విడుదల చేయడం వలన రైతులు ఆలస్యంగా వరి నాట్లు వేశారని వాటిని కాపాడే విధంగా నీరు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. అధికారులు స్పందించకుంటే ప్రజాపాలన సమావేశాల్లో ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, మండ ల నాయకులు, తునికిసాయిలు, గోపగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు

## లోక్ అదాలత్ లో 801 కేసుల పరిష్కారం

ముద్ర ప్రతినిధి, భువనగిరి:



జాతీయ మెగా లోక్ అదాలత్ లో 801 కేసులు పరిష్కారమయ్యాయని, 89 కేసులు రాజీ అయినట్లు ఎస్పీ అకాంక్ష్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన ఇ-పెట్టి 1260 కేసులలో నిందితులు జరిమానా చెలిచి వారి పైన ఉన్న కేసు లను అడ్మిషన్ చేశామన్నారు. సైబర్ నేర సంబంధిత కేసులలో నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ.36,000 తిరిగి బాధితు లకు అందేలా కోర్ట్ ఆదేశాలు వచ్చినట్లు చెప్పారు. జాతీయ లోక్ అదాలత్ ను విజ య వంతం చేసిన జిల్లా పీపీలను, పోలీస్ అధికారులను, కోర్ట్ లైజనింగ్ అధికారిని, కోర్ట్ డ్యూటీ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ కు విశ్వ సేవా రత్న బిరుదు

ముద్ర ప్రతినిధి, భువనగిరి:




భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ కు విశ్వ సేవా రత్న బిరుదు విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అందజేశారు. విద్యా వైద్యం కళ, సాహిత్య సేవా రంగాలలో ఉగాది పురస్కార ప్రదానోత్సవం మంగళవారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ డాక్టర్ దాసో శ్రావణ్, శాసన మండల సభ్యులు తల్లోజు ఆచారి, జాతీయ బీసీ కమిషనర్, జోగులంబ జిల్లా కలెక్టర్ లక్ష్మి నారాయణ, సభ్యులు హాజరయ్యారు. ఇటీవల మున్సిపల్ చైర్ పర్సన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ లు సుదీర్ఘ కాలంగా ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఉగాది పురస్కారాలలో భాగంగా విశ్వసేవారత్న బిరుదు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విశ్వకర్మల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు.

## మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ సేవలు అభినందనీయం

ముద్ర, మోత్కూర్:

మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ సేవలు అభినందనీయమని మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బొల్లెపల్లి వెంక టయ్య, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీని వాస్ రెడ్డి లు అన్నారు. మున్సిపల్ కేంద్రానికి చెందిన కన్నెబొయిన సతీష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ సహకారంతో రూ.33 వేల చెక్కు, 125 కిలోల బియ్యం మృతుని భార్య ఎల్లమ్మకు వారు అందజేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వర ఆలయ చైర్మన్ గుండగొని రామచంద్రు, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గనగాని నర్సయ్య, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, వాట్సప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, కోమటి మచ్చగిరి, చోల్లేటి నరేశ్, మొరిగాల శ్రీను, కోమటి జనార్ధన్, జంగ నర్సయ్య, పురుగుల రమేష్, జంగ సతీష్, వడకాల యాదగిరి, కె గిరి తదితరులు పాల్గొన్నారు.

## జంతు ప్రేమతో ఔషధాల విరాళం

ముద్ర ప్రతినిధి, కోదాడ:

కోదాడ పట్టణం ప్రాంతీయ పశువైద్యశాలలో పశుపోషణ లక్ష్యంగా నిర్వహిస్తున్న పశు ఔషధ బ్యాంక్ సేవలకు ఆకర్షితులైన కోదాడ పట్టణానికి చెందిన నిస్సార్ అహ్మద్ నేను సైతం జంతు ప్రేమలో ముందుంటానని, పశువులకు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే పశు ఔషధాలను విరాళంగా బుధవారం అసిస్టెంట్ డైరెక్టర్ డా పి పెంటయ్య కు అందించారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ ను డాక్టర్ పెంటయ్య అభినందించారు. దాతల సహకారంతో నిర్వహిస్తున్న పశు ఔషధ బ్యాంక్ సేవలను ఇటీవల జిల్లా కలెక్టర్ సైతం ప్రశంసించారని, నిస్సార్ అహ్మద్ విరాళం ఎంతో విలువైనదని, పశు ఔషధ బ్యాంక్ ద్వారా మూగ జీవాల రక్షణకు సహకరిస్తున్న దాతలందరికీ ధన్యవాదాలు తెలిపారు. మూగ జీవాలపై ప్రతి ఒక్కరూ ప్రేమ, జాలి, దయ కలిగి ఉండాలని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత గా గుర్తెరగాలని అన్నారు. ఈ కార్యక్రమములో సిబ్బంది రాజు, చంద్రకళ, శివ, సాగర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
02.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



నార్వే



నేచర్ రిసోర్సులు, వెల్ఫేర్ సిస్టమ్ బలంగా ఉంటుంది. జీవన ప్రమాణాలు చాలా ఉన్నతంగా ఉంటాయి.

## జనగణన బ్లాకుల రూపకల్పన పటిష్టంగా చేపట్టాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశాలు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



జనగణన తొలి విడతలో చేపట్టే ఇండ్ల గణన బ్లాకుల రూపకల్పనను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం టేక్మాల్ మండల కేంద్రంలో ఇండ్ల గణన ఏర్పాట్లను పరిశీలించారు. జనగణన తొలి దశలో భాగంగా నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియ వచ్చే నెల మే 11 నుంచి జూన్ 9 వరకు జరుగనున్న నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఇండ్ల గణన బ్లాకుల జాబితాను తయారు చేయడానికి మండలంలోని ఒక రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని గరిష్టంగా 300 ఇండ్లు లేదా 800 జనాభా ఉండే విధంగా సీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా బ్లాకులు రూపొందించాలని తెలిపారు. జనగణన బ్లాకుల రూపకల్పనలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా సమర్థవంతంగా ప్రక్రియను నిర్వహించాలన్నారు. పోర్టల్ నిర్వహణలో పొరపాట్లు లేకుండా ఉండేందుకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.

**నేడు గ్రామ, వార్డు సభలు పకడ్బందీగా నిర్వహించాలి**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 2న గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు. గ్రామ, మున్సిపల్ వార్డు సభల నిర్వహణపై బుధవారం మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా సూచనలు ఇచ్చారు. గ్రామ సభలు, మున్సిపల్ వార్డు సభలను పండగ వాతావరణంలో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో టామ్‌టామ్ చేయించి సభలపై ముందస్తు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత రెండున్నర సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. కొత్తగా అమలు చేయబోయే పథకాలపై అవగాహన కల్పించాలన్నారు అర్జీలు స్వీకరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రజల నుండి వినతిపత్రాలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా టెంట్లు, షామియానాలు, తాగునీరు, ముఖ్యమంత్రి సందేశం వీక్షణ కోసం టీవీ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామ సభకు ప్రత్యేకాధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. సభ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, సభ నిర్వహణకు సంబంధించిన మినిట్ టు మినిట్ కార్యక్రమాన్ని వివరించారు. ఈ గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ నగేష్, డీపీఓ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కేజీబీవీ, పీహెచ్‌సీపై కలెక్టర్ హైమావతి ఆకస్మిక తనిఖీలు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి బుధవారం ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భగార అన్నం, మిక్స్ కర్రీ, సాంబారు, పెరుగు తదితర వంటకాలను పరిశీలించారు. రోజువారీ డైట్ మెనూను తప్పనిసరిగా పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని రుచికరంగా వండాలని, వంటగది పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించే విధానాన్ని పరిశీలిస్తూ, ముందుగా కూర, తర్వాత అన్నం వడ్డించాలని సూచించారు. అవసరమైతే విద్యార్థులు కూర్చున్న చోటుకే వెళ్లి అన్నం, కూరలు వడ్డించాలని చెప్పారు. విద్యార్థులు కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలని, ముఖ్యంగా బాలికలకు ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కరాటే శిక్షణ అవసరమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచిత శిక్షణ అందిస్తోందని, దీని ద్వారా క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఏకాగ్రత పెరుగుతాయని వివరించారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తూ పలు సూచనలు చేశారు. విద్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఓను ఆదేశించారు. అనంతరం మండలంలోని తీగుల్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో మేజర్, మైనర్ రిపేర్ పనులపై ఆరా తీసి, మంజూరైన పనులను తప్పనిసరిగా కాంట్రాక్టర్ ద్వారా పూర్తి చేయించాలని సూచించారు.

## లేబర్ కోడ్ లు రద్దు చేయాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల నిరసన




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం మెదక్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి కే. నర్సమ్మ మాట్లాడుతూ.. కార్మిక వర్గం గత 100 సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకువచ్చారని విమర్శించారు. ఈ కోడ్లు కార్మిక హక్కులకు ముప్పుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త లేబర్ కోడ్లు బడా కార్పొరేట్ సంస్థలు, యజమానులకు అనుకూలంగా ఉన్నాయని ఆరోపించారు. అంబానీ, అదానీ వంటి పెద్ద కార్పొరేట్‌లకు లాభాలు చేకూర్చే విధంగా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. విద్యుత్ బిల్లులు అమలులోకి వస్తే పేదలకు ఉచిత విద్యుత్, రైతులకు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించకుండా ప్రభుత్వమే విద్యుత్ సంస్థలను నడపాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మున్సిపల్ నాయకులు ఏసు, అమృత్, సురేష్, శ్రీకాంత్, ఉషమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలు సహించను : ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 294/2లో సుమారు 3 ఎకరాలు 20 గుంటల అసైన్డ్ భూమి కేటాయింపుపై వివాదం చెలరేగింది. ఈ భూమిని టీజీఐఐసీ పేరుతో కుసుమ్ కుమార్ అనే వ్యక్తికి కేటాయించినట్లు సమాచారం వెలుగులోకి రావడంతో విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొండాపూర్ మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన రాజ్ మహమ్మద్ సమస్యను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, బాధితుడు గత 50 సంవత్సరాలుగా ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, సరైన పరిహారం చెల్లించకుండా అధికారుల చర్యలు అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల సహకారంతో బాధితుడిని భయభ్రాంతులకు గురిచేస్తూ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని బెదిరించడం, సాగులో ఉన్న కంది పంటను ధ్వంసం చేయడం వంటి చర్యలు పూర్తిగా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. రైతు జీవనాధారాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. గతంలో ఏపీఐఐసీ ద్వారా ఈ భూమిని ఇతరులకు కేటాయించే ప్రయత్నాలు జరిగాయని, ప్రస్తుతం టీజీఐఐసీ ద్వారా కుసుమ్ కుమార్‌కు కేటాయించినట్లు వస్తున్న సమాచారం అనుమానాలకు తావిస్తోందన్నారు. మొత్తం వ్యవహారంలో పారదర్శకత లోపించిందని అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని అత్యంత గంభీరంగా పరిగణించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసి పూర్తి వివరాలు తెలియజేశారు. అక్రమ భూమి కేటాయింపుపై తక్షణ విచారణ జరిపి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా భూమి స్వాధీనం, కేటాయింపుల విషయంలో చట్టబద్ధమైన విధానాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. బాధిత రైతుకు సరైన పరిహారం లేదా హక్కుల పరిరక్షణ కల్పించాలని పేర్కొన్నారు. "ప్రజల హక్కుల పరిరక్షణలో ఎప్పుడూ ముందుంటాను. నా నియోజకవర్గంలో ఎవరికైనా అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు" అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టం చేశారు.

## వలసల నుంచి ఉపాధి కేంద్రంగా సిద్దిపేట

- కాళేశ్వరం జలాలతో సాగులో విప్లవం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



"నాడైనా... నేడైనా... ఎప్పుడైనా అన్నింటా అగ్రగామి సిద్దిపేట" అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 300 మందికి రూ.62 లక్షల 88 వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యధికంగా సీఎం రిలీఫ్ ఫండ్ సాయం పొందిన నియోజకవర్గం సిద్దిపేటేనన్నారు. ఇప్పటివరకు 12,857 మందికి రూ.41 కోట్ల 13 లక్షల ఆర్థిక సాయం అందజేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా మండుటెండల్లో కూడా సిద్దిపేట కాలువల్లో గోదావరి జలాలు పారుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 85 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందన్నారు. ఒకప్పుడు బొంబాయి, దుబాయ్‌లకు వలస వెళ్లిన సిద్దిపేట ప్రజలు, ప్రస్తుతం బీహార్, ఛత్తీస్గఢ్ కార్మికులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఐటీ, పారిశ్రామిక రంగాల్లోనూ సిద్దిపేట వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. చెక్కులు అందుకున్న వారు వెంటనే బ్యాంకుల్లో జమ చేసుకోవాలని, తేదీ మారితే ఇబ్బందులు తలెత్తవచ్చని సూచించారు. ఎండాకాలంలో కూడా 85 వేల ఎకరాల్లో వరి పండించడం కాళేశ్వరం ప్రాజెక్టు వరమని చెప్పారు. అది లేకపోతే సిద్దిపేట ఈ స్థాయిలో ఉండేదా అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. ప్రస్తుతం ఎకరానికి రూ.4 నుంచి 5 వేల వరకు ఇచ్చి వరి నాట్లు వేయిస్తున్నారని తెలిపారు. సాగునీరు సమృద్ధిగా ఉండటంతో నంగునూరు, చిన్నకోడూరు ప్రాంతాల్లో రైతులు మిర్చి సాగు చేసి మంచి ఆదాయం పొందుతున్నారని చెప్పారు. కొందరు ఆయిల్ పామ్ తోటలు పెంచి లాభాలు ఆర్జిస్తున్నారని అన్నారు. యువత ఉపాధి కోసం మిట్టపల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌లో పరిశ్రమలు తీసుకువచ్చామని తెలిపారు. సిద్దిపేట ఐటీ పార్క్ ద్వారా ఇప్పటికే 600 మంది యువతకు ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. వ్యవసాయం, ఉపాధి, ఐటీ రంగాల్లో సిద్దిపేటను ముందంజలో నిలిపామని, రాబోయే రోజుల్లో కూడా కలిసికట్టుగా పనిచేసి మరింత అగ్రగామిగా తీర్చిదిద్దుకుందామని హరీశ్ రావు పిలుపునిచ్చారు.

## నేడు పంచముఖి హనుమాన్ జయంతి ఉత్సవాలు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ పట్టణంలోని గోసముద్ర తటాక తీరాన వెలసిన శ్రీ పంచముఖి హనుమాన్ దేవాలయం హనుమాన్ జయంతి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 2న ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 7.30 గంటల నుంచి 108 పర్యాయాలు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుంది. అనంతరం ఉదయం 11 గంటల నుంచి అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. రాత్రి 9.30 గంటల నుంచి భక్తుల ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వంశానుగత ధర్మకర్త కాకులవరం మధుసూధనాచారి తెలిపారు. ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు.

## నేడు అల్మాయిపేట గ్రామ సభ

**పాల్గొననున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధిలోని అల్మాయిపేట గ్రామంలో నేడు నిర్వహించనున్న "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జరుగనున్న గ్రామ సభలో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొననున్నట్లు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ హన్మండ్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని వెల్లడించారు. ప్రజలందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులతో జోగిపేట 14వ వార్డు కౌన్సిలర్ ఊర్మిళ దుర్గేష్ చేతుల మీదుగా బుధవారం బాధితురాలు జె. శంకరమ్మకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ద్వారకా నగర్ హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర ఆటోనగర్, పాత బస్టాండ్, రాందాస్ చౌరస్తా, పోస్టాఫీస్ మార్గంగా పట్టణంలో భారీగా సాగింది. ఎత్తయిన హనుమాన్, శ్రీరాముడి ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రత్యేక లైట్ల ప్రభలు ముందుండగా మహిళలు, యువకులు, భక్తులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. "జై శ్రీరాం", "జై హనుమాన్" నినాదాలు మారుమ్రోగాయి. బీజేపీ, విహెచ్పి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంఎన్ కెనాల్ బ్రిడ్జి, పాత బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.



## అన్నప్రసాద వితరణ

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ సాహితి రాము గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఆసుపత్రిలో ఉన్న రోగులు, వారి బంధువులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. భక్తులకు అవసరమైన ఆహారం అందించడం ద్వారా సామాజిక సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఆసుపత్రి పరిసరాల్లో ఉన్న పేదలు, రోగులకు ఆహారం అందించడం ఎంతో ఉపయుక్తమైందని తెలిపారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని తన నివాసంలో ప్రముఖ నటుడు అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ (ఏఏఎఫ్ఏ) ఆధ్వర్యంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై సోషల్ మీడియా, వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలను అభినందించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు కారణమయ్యే హ్యూమన్ పాపిలోమా వైరస్ నుంచి రక్షణ కల్పించే సురక్షితమైన, అత్యంత ప్రభావవంతమైన వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.ఈ వ్యాక్సిన్‌ను బాలురు, బాలికలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచామని చెప్పారు. 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ తీసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మంత్రి ఆకాంక్షించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
02.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**లక్సెంబర్గ్**



చిన్న దేశం అయినా అధిక ఆదాయం కలిగిన ప్రజలు ఉంటారు. సురక్షిత వాతావరణం, మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

# కొత్తగా 62 వేల మందికి రైతు భరోసా

- కొత్త పాస్ పుస్తకాలు ఉన్న వారికీ ఇవ్వాలని సర్కార్ నిర్ణయం
- దరఖాస్తుల పరిశీలన తర్వాత తుది జాబితా
- ఈ నెల 20లోపు రెండో విడత

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




కొత్తగా పట్టా దార్ పాస్ పుస్తకాలు పొందినవారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇప్పటివరకు కొత్త పాస్ పుస్తకాలు వచ్చిన వారికి రైతు భరోసా నిధులు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీంతో ఇప్పటికే అప్లై చేసుకున్న 62 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి.. నిజానిజాలు నిర్ధారణ చేసుకున్న తర్వాత.. తుది జాబితాను రెడీ చేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు పాత లబ్ధిదారులకే అమలు చేస్తున్న రైతు భరోసా పథకాన్ని.. కొత్తగా భూములు కొనుగోలు చేసి.. పట్టాలు పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పాస్ బుక్కులు పొందినవారు సుమారు 85 వేల మంది రైతులు ఉన్నారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ 85 వేల మందిలో ఇప్పటికే 62 వేల మంది అన్నదాతలు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన చేస్తోంది. అర్హులకు సంబంధించిన ఫైనల్ లిస్ట్‌ను అధికారులు సిద్ధం చేయనున్నారు.

### ఈ నెల 20లోపు రెండో విడత భరోసా

రైతు భరోసా పథకానికి అర్హులుగా తేలిన కొత్త అన్నదాతలకు ఏప్రిల్ 15వ తేదీ నుంచి 20వ తేదీల మధ్య యాసంగి రెండో విడత రైతు భరోసా నిధులను.. వారి బ్యాంకు అకౌంట్లలో జమా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ సీజన్‌లో సుమారు రూ. 9 వేల కోట్లను అన్నదాతల అకౌంట్లలో జమా చేసే లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో గత వానాకాలం సీజన్‌లో లబ్ధి పొందిన ప్రతీ రైతుకు.. ఈ యాసంగి సీజన్‌లో కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి పెట్టుబడి సాయం అందనుంది. ఇదీలావుంటే.. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 69.39 లక్షల మంది అన్నదాతలకు ఎకరానికి రూ.6 వేల చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లు.. కేవలం 9 రోజుల వ్యవధిలోనే అకౌంట్లలో జమ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. ఇక రైతు భరోసా పథకం లబ్ధిదారుల సంఖ్యలో 5.22 లక్షల మందితో నల్గొండ జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో 3.53 లక్షలతో సంగారెడ్డి.. ఖమ్మం 3.35 లక్షలు.. సిద్ధిపేట జిల్లా 3.18 లక్షలతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.



## తెలంగాణ పల్లెలకు జాతీయ పురస్కారాలు

- గుడ్ ఫర్ గవర్నెన్స్ విభాగంలో మోతుకుపల్లి
- 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ'గా ఫసల్వాడి
- హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో తెలంగాణ జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన ప్రతిష్టాత్మక "దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు" లో రాష్ట్రానికి చెందిన రెండు గ్రామ పంచాయతీలు జాతీయ అవార్డులను దక్కించుకున్నాయి. దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్న పంచాయతీలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఈ క్రమంలో గుడ్ ఫర్ గవర్నెన్స్ విభాగంలో వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలం మోతుకుపల్లి గ్రామ పంచాయతీ పురస్కారం దక్కించుకుంది. గ్రామ స్థాయిలో పారదర్శక పరిపాలన, ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన ప్రతిభకు గుర్తింపు లభించింది. అలాగే సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో జాతీయ అవార్డుకు ఎంపికైంది. మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన కృషికి గాను ఈ అవార్డు దక్కింది. తెలంగాణకు జాతీయ అవార్డులు దక్కడంపై రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు.

# డిగ్రీ లెక్చరర్ పోస్టుల్లో అక్రమాలకు కుట్ర

- యువతకు ఉద్యోగాలు దక్కకుండా అడ్డంకులు
- ఉద్యోగాలు తమ వారికే ఇచ్చేలా జీవోలు
- జాగృతి అధ్యక్షురాలు కవిత

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



గ్రూప్ 1 తరహాలో డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులనూ తమవారికి కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. బుధవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. గ్రూప్1 లో తాము అనుకున్న వారికే ఉద్యోగాలు ఇచ్చేలా ప్రత్యేక ఎగ్జామినేషన్ సెంటర్ పెట్టి కుట్ర చేశారని గుర్తు చేశారు. సరిగ్గా అదే విధంగా డిగ్రీ లెక్చరర్ల భర్తీ విషయంలోనూ ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే జీవో నంబర్ 4 తో పాటు పీహెచ్డీ చేసిన వారికి 25 మార్కుల వెయిటేజీ, ఇంటర్వ్యూ కి పది మార్కులంటూ నిబంధనలు తమ వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారని విమర్శించారు. అసలు పీహెచ్డీ అడ్మిషన్లే లేకుండా 25 మార్కుల వెయిటేజీ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వెంటనే జీవో నంబర్ 4 ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**అడ్డంకిగా ఉన్న జీవో లను రద్దు చేయాలి...**

డీఎస్సీ కి జీవో నంబర్ 104, గ్రూప్స్ కు జీవో నంబర్ 29, పోలీసు ఉద్యోగాలకు జీవో నంబర్ 46, గురుకులాలకు జీవో నంబర్ 81, ఆడబిడ్డలకు రిజర్వేషన్లు రాకుండా జీవో నంబర్ 4 ను తెచ్చారని కవిత చెప్పారు. గత ప్రభుత్వం గానీ ఈ ప్రభుత్వం గానీ ఈ జీవోలను కనీసం సమీక్షించలేదని విమర్శించారు. దాదాపు 40 లక్షల కుటుంబాల్లో విద్యార్థులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటే...ప్రభుత్వం మాత్రం వారికి న్యాయం చేసే విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. మూసీ కి రూ.7 వేల కోట్లు కేటాయిస్తూ రివ్యూ చేసే సమయం ఉన్న ప్రభుత్వానికి నిరుద్యోగులకు శాపంగా మారిన జీవో లపై సమీక్ష చేసే సమయం లేదా అని కవిత ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

### పైశాచికం మానేయాలి..

రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని, పేద ప్రజలకు మేలు చేసే రేషన్ కార్డుల విషయంలో పైశాచిక పనులను మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**కొండగట్టు పనుల్లో నిర్లక్ష్యం!**

కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడిన ఘటనపై కవిత విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన జయంతి వేడుకల కోసం నాసిరకంగా పందిళ్లు వేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించటంతో పాటు ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



## శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్

**ముద్ర, తిరుమల :**

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బుధవారం ఉదయం కుటుంబ సమేతంగా ఆలయం మహద్వారం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి శ్రీమతి జానకి శుక్లా ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించారు. అధికారులు వారికి శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటం, క్యాలెండర్లు అందజేశారు. దర్శనం తర్వాత టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి గవర్నర్ ను పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం గవర్నర్ దంపతులు తిరుచనూర్ లోని శ్రీ పద్మావతి అమ్మ వారి ఆలయం ను సందర్శించి పూజలు నిర్వహించారు.



## నిరుపేదలకు తీరని అన్యాయం

- భూదాన్ బోర్డు ఏర్పాటు చేయాలి
- వెలుగుమట్ల బాధితులతో ఎన్డీ సదస్సు

**ముద్ర, ఖమ్మం:**

ఖమ్మం వెలుగుమట్లలో నిరుపేదలకు తీరని అన్యాయం జరిగిందని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అవునూరి మధన్న అన్నారు. భూ బాధితులతో సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో బుధవారం సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అవునూరి మధన్న మాట్లాడుతూ.. 62 ఎకరాల ఏడు గంటల భూమి మొత్తం భూదాన్ భూమి అని, తిరిగి తక్షణమే భూదాన్ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. 60 ఎకరాల్లో 30 ఎకరాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వం అప్పజెప్పిందని దాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోట్ల రూపాయల భూమి భూమి వ్యాపారులకు ఇచ్చి.., నిరు పేదలు గుడిసెలను కూల్చివేయడం అ ప్రజాస్వామ్యం అని అన్నారు. తీవ్రంగా నష్టపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వకుండా కేవలం 70 గజాల్లో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పటం విడ్డూరంగా ఉన్నదని వారు అన్నారు. ఇకనైనా ప్రభుత్వం పేదలకు న్యాయం చేయకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూదాన్ భూమి బాధితులు కూరపాటి రామారావు, రామాంజనేయులు ,ఖదీర్,పాషా జయమ్మ ఆంజనేయులు పుల్లమ్మ సత్యవతి సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మందుల రాజేంద్ర ప్రసాద్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకట్రాంరెడ్డి, జిల్లా నాయకులు వై ప్రకాష్, గిరి, లక్ష్మి ,రమేష్, మోహన్ రావు ,జానకి, సురేష్, ఉమా శంకర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవుల మీద సుప్రీంకోర్టు తీర్పును పునః పరిశీలించాలి

- సీపీఐ నారాయణ డిమాండ్

**ముద్ర, చిత్తూరు:**



సుప్రీంకోర్టు దళిత క్రైస్తవుల మీద ఇచ్చినటువంటి తీర్పును పునఃపరిశీలించాలని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు డాక్టర్ కే.నారాయణ అన్నారు. ఈ తీర్పు పై నగరి పట్టణంలోని క్రైస్తవ మత పాస్టర్లు, సంఘాల పెద్దలు, విశ్వాసులతో అభిప్రాయాలను అడిగి తెలుసుకున్న తరువాత మీడియాతో మాట్లాడారు. ఏపీకి చెందిన క్రైస్తవ పాస్టర్ మీద జరిగిన దాడిలో రాష్ట్ర హైకోర్టు దళిత క్రైస్తవులకు ఎస్సీ హక్కులతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద రక్షణ పొందలేరన్న తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని ఖండించారు. భారతదేశంలో మతం మారినంత మాత్రాన కులం మారదు, అంటరానితనం, వివక్ష మారదన్న ప్రాథమిక అవగాహనతో కూడిన కనీస చట్ట రక్షణను సుప్రీంకోర్టు గ్రహించాలన్నారు. సుప్రీంకోర్టు ద్వారా మోడీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ, సంఘపరివార్ లు తమ అజెండాను పలికించడం బాధాకరమని అన్నారు.

## బీజేపీ ఆఫీస్ వద్ద పేలుడు కలకలం

**ముద్ర న్యూస్ :**

చండీగఢ్‌లోని భాజపా కార్యాలయం వద్ద పేలుడు సంభవించింది. పార్కింగ్ చేసి ఉంచిన స్కూటీలో పేలుడు జరిగింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. చిన్న పేలుడు వస్తువు విసిరినట్లు అనిపించిందని, ఇది ఆకతాయిల పని అయి ఉండవచ్చని అనుమానిస్తున్నట్టు సీనియర్ ఎస్పీ కన్వార్‌దీప్ కౌర్ వెల్లడించారు. ఘటనా ప్రదేశాన్ని ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు.. నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.




# హనుమాన్ జయంతికి కొండగట్టు ముస్తాబు..



- పెద్ద ఎత్తున తరలివస్తున్న అంజన్న దీక్షాపరులు
- అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు
- కూలిన చలువ పందిరి

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న ఆలయంలో బుధవారం నుంచి చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయానికి హనుమాన్ దీక్షాపరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మాల విరమణ చేస్తారు. ఆలయ నిర్వాహకులు, అధికారులు భక్తుల కోసం చలవ పందిళ్లు, తాగునీటితో పాటు తదితర వసతుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

### 15 మంది భక్తులకు గాయాలు..



కేశఖండన చేసుకునే హనుమాన్ దీక్షాపరుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా ఈదురుగాలులతో పాటు అకాల వర్షాల సందర్భంగా ఆలయం ఎదుల ఏర్పాటు చేసిన చలవ పందిరి కూలింది. ఈ ఘటనలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన సుమారు 15 మంది భక్తులకు గాయాలయ్యాయి. వెంటనే వీరిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.

**భద్రతా ఏర్పాట్లు..**

కొండగట్టులో మూడు రోజుల పాటు జరగనున్న చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున హనుమాన్ దీక్షపరులు తరలివస్తారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు కొండగట్టు హనుమాన్ ఆలయం, పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎస్పీ అశోక్ కుమార్, డిఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో 750 మంది పోలీసులతో భారీ భద్రత ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టారు. భక్తులు ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకునేలా అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
02.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



స్విట్జర్లాండ్
ఆర్థికంగా బలమైన దేశం, నాణ్యమైన జీవనం ఉంటుంది. ప్రకృతి అందాలు, ఆరోగ్య సేవలు అద్భుతంగా ఉంటాయి.



## ప్రజా సమస్యలపై తక్షణ పరిష్కారానికి చర్యలు

- **చిన్నదగడ, అమ్మాయిపల్లి ప్రజలతో ముఖాముఖి**
- **రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:**

ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని చిన్నదగడ, అమ్మాయిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్వహించిన ముఖాముఖిలో గ్రామస్థులు తమ సమస్యలను నేరుగా మంత్రికి వివరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పనుల్లో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. అలాగే సంక్షేమ పథకాల అమలు పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## చిన్నారిని చిదిమేశారు

- **అమ్మిరెడ్డి పల్లి లో విషాదం**
- **చిన్నారి ఒంటిపై ఉన్న బంగారు, వెండి వస్తువుల అపహరణ**

**ముద్ర, నారాయణపేట:**



నారాయణపేట జిల్లా అమ్మిరెడ్డి పల్లి గ్రామంలో ఐదేళ్ల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన ఘటన ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఈ విషాద ఘటన బుధవారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. హత్య చేసిన దుండగులు ఆ చిన్నారి ఒంటిపై ఉన్న బంగారు, వెండి వస్తువులను అపహరించుకొని పారిపోయారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అంజయ్య శిరీష పొట్ట కూటి కోసం హైదరాబాద్ కు వలస వెళ్లి అక్కడే కూలీ పని చేసుకుని బతుకుతున్నారు. వీరి ఇద్దరు సంతానంలో చిన్న కూతురు తేజశ్రీని (5) గ్రామంలో నానమ్మ, తాతయ్య ఉంచారు. ఆమె స్థానిక అంగన్వాడీలో చదువుకుంటోంది. రాత్రి ఆరు బయట నానమ్మ, తాతయ్యతో కలిసి నిద్రించిన చిన్నారి, తెల్లవారుజామున గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్ద స్థానికులకు శవమై కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఆస్తి తగాదాల కోసం చిన్నారిని హత్య చేశారా? లేదా ఒంటిపై ఉన్న బంగారం వెండి అపహరించేందుకు హత్య చేశారా? మరి ఏమైనా ఇతర కారణాలు ఉన్నాయా తెలియాల్సి ఉంది.

## తేయాకు తోటల్లో 'చాయ్‌వాలా'

- **కూలీలతో కలిసి తేయాకు కోస్తూ మోదీ ముచ్చట్లు**
- **ప్రధానితో కార్మికుల సెల్ఫీలు**
- **ఎన్నికల ప్రచారంలో ప్రధాని శైలి**

**ముద్ర, డెస్క్:**



అస్సాం పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక శైలిలో కనిపించారు. దిబ్రుగఢ్‌లోని ఒక తేయాకు తోటలో కార్మికులను ప్రధాని మోదీ ఆశ్చర్యపరిచారు. అక్కడి మహిళలతో కలిసి తేయాకు కోస్తూ వారితో కాసేపు ముచ్చటించారు. మహిళా కూలీల కోరిక మేరకు వారితో సెల్ఫీలు కూడా తీసుకున్నారు. ఆ ఫోటోలను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. తేయాకును అస్సాం ఆత్మగా మోదీ అభివర్ణించారు. ఈ రాష్ట్ర తేయాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ఈ పర్యటనను చిరస్మరణీయ అనుభవంగా అభివర్ణిస్తూ, తేయాకు కార్మికుల కృషిని అభినందించారు. “ప్రతి తేయాకు తోట కుటుంబం చేసిన కృషికి చాలా గర్వపడుతున్నాం. వారి కఠోర శ్రమ, పట్టుదల అస్సాం గౌరవాన్ని పెంచాయి,” అని మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పర్యటన ఫోటోలను పంచుకుంటూ “తేయాకు కోయడం అనంతరం మహిళలు తమ సంస్కృతి గురించి మాట్లాడారు, ఆపై ఒక సెల్ఫీ కూడా తీసుకున్నారు!” అని ప్రధాని పేర్కొన్నారు.

## గోదావరి పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టు ప్రారంభం

- **చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభం**

**ముద్ర, నెల్లూరు:**

గోదావరి పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. నెల్లూరు జిల్లా వింజమూరులో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, పోలవరానికి కేంద్రం రూ.1300 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చిందన్నారు.నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరుగుతోందని, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులతో పాటు రక్షణ పరికరాలు, డ్రోన్ల తయారీ పరిశ్రమలు వస్తాయని తెలిపారు. ఇఫ్కో సెజ్ ద్వారా 80 వేల ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందన్నారు. చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభిస్తూ, 93 వేల కుటుంబాలకు 200 యూనిట్లు, 11,443 పవర్‌లూమ్‌లకు 500 యూనిట్లు ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఇందుకు రూ.153 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. 55 ఏళ్లకే పెన్షన్ కోసం రూ.5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీపం 2.0 కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, త్వరలో పైప్ గ్యాస్ ఇంటింటికీ అందిస్తామని చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై అసత్య ప్రచారం జరుగుతోందని విమర్శిస్తూ, రూ.285 కోట్లతో దీనిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. తమిళనాడు మత్స్యకారులు ఏపీ జలాల్లో వేట చేయకుండా నిఘా పెంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

# ఈ నెల 15 వరకు ఇంటింటికీ సీపీఐ

- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**
- **పార్టీ కోసం ప్రజల నుంచి విరాళాల సేకరణ**
- **అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ఉద్యమం**
- **సంతృప్తికరంగా అసెంబ్లీ సమావేశాలు**
- **స్పీకర్ ఎవరి గొంతు నొక్కలేదు**
- **మరిన్ని రోజులు కొనసాగిస్తే మరింత ఉపయుక్తంగా ఉండేది**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




‘ఇంటింటికి సీపీఐ’ పేరుతో ఈ నెల 15వ తేదీ వరకు ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి విరాళాలను సైతం సేకరించనున్నట్లు వివరించారు. సీపీఐ ఇప్పటికే అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తోందన్న ఆయన త్వరలో అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం పెద్దఎత్తున ఉద్యమించనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్‌తో రాజకీయంగా స్నేహ బంధం ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై సిపిఐ ఎప్పుడూ ఎక్కడా రాజీ పడబోదని ఆయన స్పష్టం చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహాతో కలిసి బుధవారం ఆయన హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు గంటల పరంగా బాగానే జరిగినప్పటికీ సమావేశాలను మరిన్ని రోజులు కొనసాగిస్తే మరింత ఉపయుక్తంగా ఉండేదని అభిప్రాయపడ్డారు. సమావేశాల్లో బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐలకు కావాల్సినంత సమయం ఇచ్చారన్నారు మొత్తం 4.22 గంటల పాటు తాను మాట్లాడినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రతి పేదవాడి సమస్యను సభ దృష్టికి తీసుకువెళ్లగలిగానని సాంబశివరావు సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని పార్టీలకు స్పీకర్ మాట్లాడే అవకాశం ఇచ్చి, ఎవరి గొంతు నొక్కలేదు అన్నారు. ఇరాన్ పై అమెరికా సామ్రాజ్యవాద దేశం చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని తాను పెట్టిన తీర్మానాన్ని ప్రభుత్వపరంగా శాసనసభలో తీర్మానం ప్రవేశ పట్టినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3.24 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పటికీ వ్యక్తి కేంద్రంగా కాకుండా అసమానతలు పెంచే విధంగా ఉందని సాంబశివరావు పేర్కొన్నారు. బడ్జెట్ అనేది వ్యక్తి కేంద్రంగా ఉండాలని, బడ్జెట్ ఫలాలు చివరి వ్యక్తి వరకు అందాల్సి ఉండగా, ఇది ప్రతిబింబించడం లేదన్నారు.

**సుప్రీం తీర్పును అపహాస్యం చేసిన ‘షా’**

మావోయిస్టుల హననమే లక్ష్యంగా రాజ్యాంగానికి విరుద్ధంగా ఏర్పాటు చేసిన నరహంతక అరాచక ముఠా ‘సల్వాజూడుం’ను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గతంలో వెలువరించిన తీర్పును ఇప్పుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అపహస్యం చేయడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని కూనంనేని అన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేసి న్యాయవ్యవస్థను పరిరక్షించాల్సిన కేంద్ర మంత్రి అమిత్ షా ఆయన భావాలతో ఏకీభవించని వ్యక్తులు ఇచ్చిన తీర్పును అగౌరవపర్చడం న్యాయవ్యవస్థను కించపర్చడం, ఒక రకంగా బెదిరించడమేనన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లాంటి ప్రగతిశీల భావాలు కలిగిన న్యాయమూర్తులను ఆక్షేపించడం రాజ్యాంగానికి ద్రోహం చేయడమేనన్నారు. హై కేంద్ర మంత్రి ఏమాత్రం చరిత్రను అధ్యయనం చేయకుండా దానిని పూర్తిగా వక్రీకరిస్తూ పార్లమెంట్‌లో మాట్లాడారని కూనంనేని సాంబశివరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సిద్ధాంత మూలం మార్క్సిజమని, తత్వం భారతదేశానిదని, ఈ దేశ కాలమాన పరిస్థితులను అనువహించుకుని రూపొందించుకోవడం జరిగిందని చెప్పారు. దేశ స్వాతంత్ర సంగ్రామంలో ఏనలేని త్యాగాలను చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు.

**విప్లవ వీరులను...**

ఈ దేశానికి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి విప్లవ వీరులను అందించడంతో పాటు అనేక సంస్థానాలను విముక్తి చేసి, భూమి, భుక్తి, పేదవర్గాల కోసం పోరాటాలు చేసి 8 గంటల పని విధానాన్ని అందించిన ఘన చరిత్ర ఉందన్నారు. దేశ స్వాతంత్రోద్యమంలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటో అమిత్‌షా చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాధికారాన్ని అడ్డం పెట్టుకుని మావోయిస్టులను భౌతికంగా అంతం చేయవచ్చేమో గానీ, మావోయిజం మూలం కమ్యూనిజమని, దీనిని ఎవరూ అంతం చేయలేరని సాంబశివరావు స్పష్టం చేశారు. బీజేపీ సిద్ధాంతంలోనే సోషలిజం అనే పేరు ఉందని, రాజ్యాంగంలో సైతం పొందపర్చబడిందని, ఈ పదానికి భయపడితే ఏలా, ఇలాంటి చర్యలు దుర్మార్గమన్నారు. మరోవైపు మావోయిస్టుల పేరుతో అర్బన్ నక్సలైట్లు అనే ముద్ర వేస్తూ వేధింపులకు గురిచేసే పాలకులు చేసిన చట్టాలకు వారే బంధీలు అవుతారని, అవే వారికి ఉరి తాళ్లు అవుతాయని హెచ్చరించారు. దళితులు ముస్లిం, క్రైస్తవ మతాల్లోకి మారితే వారికి అంతకు ముందున్న కులం గాని, రిజర్వేషన్లు కాని వర్తించవని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం అన్యాయమని, ఈ తీర్పును న్యాయమూర్తులు పునర్ సమీక్షించాలని సాంబశివరావు కోరారు.

## 968 గజాల పార్కును కాపాడిన హైడ్రా

**ముద్ర, హైదరాబాద్ :**




మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం గ్రామంలోని అక్షయ ఎన్‌క్లేవ్ పేరుతో1983లో 7.12 ఎకరాల్లో లే ఔట్ వేశారు. హుడా అనుమతి పొందిన లే ఔట్‌లో 968 గజాల మేర ఉన్న పార్కును తప్పుడు పత్రాలతో అబ్దుల్ రెహ్మాన్ అలియాస్ గోపాల్ అనే వ్యక్తి కబ్జాకు ప్రయత్నిస్తున్నాడని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో ఈ ఫిర్యాదును పరిశీలించిన హైడ్రా అధికారులు పార్కు స్థలంగా నిర్ధారించుకున్నారు. ఇప్పటికే జీహెచ్ ఎంసీ ప్రహరీ నిర్మించి గేటు కూడా పెట్టిన విషయాన్ని గుర్తించారు. 2019లో తప్పుడు పత్రాలతో నిర్మాణ అనుమతులు కూడా తెచ్చుకుని ఆక్రమణలకు సిద్ధం కాగా కబ్జాదారులపై జీహెచ్ ఎంసీ అధికారులతో పాటు సొసైటీ ప్రతినిధులు కూడా కేసులు పెట్టారు. 968 గజాల పార్కు స్థలంలో కబ్జాదారులు వేసిన సామాగ్రిని తొలగించి పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు.

## ప్రధానికి ధన్యవాదాలు

**ముద్ర, అమరావతి:**




అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపినందుకు ప్రధాని మోదీకి ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే ఇదంతా సాధ్యమయిందని, అమరావతి రైతుల తరపున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు కూడా నారాయణ అభినందనలు తెలిపారు. 2024 జూన్ 2 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అమల్లోకి రానుందని తెలిపారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## అమరావతి ఇక అజేయం.. అజరామరం



- **అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

**ముద్ర, డెస్క్ :**

ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది.

## ఎమ్మెల్సీ విజయశాంతిని కలిసిన తెలంగాణ ఉద్యమకారులు



**ముద్ర, కుషాయిగూడ:**

అసెంబ్లీ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను లేవనెత్తిన ఎమ్మెల్సీ విజయశాంతిని తెలంగాణ ఉద్యమకారులు బుధవారం కలసి కృతజ్ఞతలను తెలిపారు.పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారులను విస్మరించి, మోసం చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల సమస్యలను కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రకటనలో చేర్చినా, అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. చట్టసభల్లో కేవలం విజయశాంతితో పాటు సీపీఐ నాయకుడు కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామ్యూల్, రామ్మోహన్ రెడ్డి మాత్రమే స్పందించారన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి, సుల్తాన్ యాదగిరి, మల్లూరి అనిల్ కుమార్, రామగిరి ప్రకాష్, గుండా యాదగిరి, సామా అంజిరెడ్డి, చంద్రన్న ప్రసాద్, కంచర్ల బద్రి, మోత్కూరి మల్లేష్, బీరకాయల మధుసూదన్, పుట్టా రంజిత్, బోయపల్లి రంగారెడ్డి, శంకర్రావు, హరిప్రసాద్, సత్యం, రాజు, గంధమాల యాదగిరి, యనమల రవి, ఎర్ర జాన్సన్, అంజలి కుమారి, బాకారం లావణ్య, లక్ష్మికాంతమ్మ, ఓగిరాల సుజి, లలిత, పుష్ప, దుర్గాని శ్యామల, కమల, అరుణ, స్వరూప, భాస్కర్, మోజేష్ పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా

ఉద్యోగ అవకాశాలు, జీవన ప్రమాణాలు చాలా మంచివి. వెదర్, జీవనశైలి ప్రజలకు




## “నా స్టైల్ మార్చను” – మళ్లీ దిగ్వేష్ ఓవరాక్షన్

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్‌లో భాగంగా బుధవారం లక్నో-ఢిల్లీ జట్ల మధ్య మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది. కెప్టెన్లు రిషబ్ పంత్, అక్షర్ పటేల్ తమ జట్లను ఎలా నడిపిస్తారో చూడాలి. రెండు జట్లలోనూ బలమైన బ్యాటింగ్, బౌలింగ్ లైనప్ ఉండడంతో మ్యాచ్ హోరాహోరీగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. డ్యూ ప్రభావం ఉండే అవకాశం ఉండటంతో టాస్ కీలకంగా మారింది. ఇక మ్యాచ్‌కు ముందు లక్నో స్పిన్నర్ దిగ్వేష్ రాటి వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. గత సీజన్‌లో ‘నోటుబుక్ సెలబ్రేషన్’తో వివాదాల్లో నిలిచిన అతడు, తన స్టైల్ మార్చుకోనని స్పష్టం చేశాడు. “నేను ఎవరినీ అవమానించడం లేదు.. ఇది నా సెలబ్రేషన్ మాత్రమే” అని పేర్కొన్నాడు. అయితే అతని ఓవరాక్షన్‌పై ఇప్పటికే హెచ్చరికలు వస్తున్నాయి. మరోసారి అతిగా ప్రవర్తిస్తే మ్యాచ్ ఫీజులో కోత లేదా చర్యలు తప్పవని విశ్లేషకులు అంటున్నారు. దీంతో బుధవారం మ్యాచ్‌లో దిగ్వేష్ ప్రవర్తన ఎలా ఉంటుందో ఆసక్తిగా మారింది.



# తొలి మ్యాచ్ తోనే సంచలనం..

## అరంగేట్రంలోనే మెరిసిన కూపర్ కానలీ



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ 2026 సీజన్‌లో మరో యువ ఆటగాడు తన ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించాడు. కేవలం 22 ఏళ్ల వయసులోనే ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కూపర్ కానలీ ఐపీఎల్ అరంగేట్ర మ్యాచ్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి పంజాబ్ కింగ్స్ జట్టుకు ఉత్కంఠభరితమైన విజయాన్ని అందించాడు. తన తొలి మ్యాచ్‌లోనే ఒత్తిడిని తట్టుకుని మ్యాచ్ గెలిపించడం ద్వారా భవిష్యత్తులో పెద్ద ఆటగాడిగా ఎదగగల సామర్థ్యం ఉందని నిరూపించాడు. గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన 162 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పంజాబ్ జట్టు ప్రారంభంలోనే వికెట్ కోల్పోయింది. ఆ సమయంలో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కానలీ బాధ్యత తీసుకుని అద్భుతంగా ఆడాడు. కేవలం 44 బంతుల్లోనే 72 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. తన ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు కొట్టి జట్టును విజయపథంలో నడిపించాడు. చివరి ఓవర్‌లో ఫోర్ కొట్టి మ్యాచ్‌ను ముగించడంతో పాటు ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు కూడా అందుకున్నాడు. కానలీని ఐపీఎల్ 2026 వేలంలో పంజాబ్ కింగ్స్ రూ. 3 కోట్లకు కొనుగోలు చేసింది. దూకుడు బ్యాటింగ్‌తో పాటు స్పిన్ బౌలింగ్ చేయగల సామర్థ్యం ఉండటంతో అతడిని పూర్తిస్థాయి ఆల్‌రౌండర్‌గా పరిగణిస్తున్నారు. అతని ఆట తీరు ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్‌ను గుర్తు చేస్తోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. యువ ఆటగాడైన కానలీ ఇప్పటికే టీ20 క్రికెట్‌లో మంచి రికార్డులు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. పశ్చిమ ఆస్ట్రేలియా తరపున దేశీయ క్రికెట్ ఆడుతున్న కానలీ ఆస్ట్రేలియా జాతీయ జట్టులో కూడా అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు టెస్ట్, వన్డే, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అవకాశాలు పొందిన అతను భవిష్యత్తులో ఆస్ట్రేలియా జట్టుకు కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐపీఎల్ అరంగేట్రంలోనే మెరిసిన ఈ యువ ఆల్‌రౌండర్ రాబోయే మ్యాచ్‌లలో కూడా ఇదే జోరు కొనసాగిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు



## ఓరేయ్ చంకలో పెట్టి నలిపేస్తా.. వద్దు.. క్షమించు బ్రో..

**ప్రాక్టీస్ సెషన్‌లో ప్రాంక్ వైరల్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ సీజన్ ఉత్సాహంగా కొనసాగుతున్న సమయంలో జట్ల ప్రాక్టీస్ సెషన్ల్లో కూడా సరదా వాతావరణం కనిపిస్తోంది. తాజాగా కోల్‌కతా నైట్ రైడర్స్ ప్రాక్టీస్ సమయంలో జరిగిన ఒక ఫన్నీ ప్రాంక్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో సీరియస్‌గా పాల్గొంటున్న సమయంలో అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటన అందరినీ నవ్వుల్లో ముంచేసింది. వీడియోలో వెస్టిండీస్ స్టార్ ఆటగాడు రోవ్‌మన్ పావెల్ దగ్గరకు జట్టు నిర్వాహకుడు ఒక్కసారిగా వచ్చి అతని కాలర్ పట్టుకుని కోపంగా మాట్లాడాడు. ఇంతలో కాసేపు పావెల్ ఆశ్చర్యపోయి. “ఓరేయ్ చంకలో పెట్టి నలిపేస్తా” అన్నట్లు చూశాడు. వెంటనే ఆ నిర్వాహకుడు ఎక్కడ నిజంగానే కొడతాడో అని “వద్దు.. క్షమించు బ్రో.. సరదాగా చేశాను” అని ఇది ప్రాంక్ అనగానే పరిస్థితి ఒక్కసారిగా మారిపోతుంది. అది ప్రాంక్ అని అర్థమయ్యాక పావెల్ కూడా పగలబడి నవ్వేశాడు. ఈ వీడియో చూసిన అభిమానులు కూడా ఫన్నీ కామెంట్లు చేస్తూ సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ చేస్తున్నారు. ఈ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తమ తొలి మ్యాచ్‌లో ఓటమి చవిచూసినప్పటికీ, జట్టు వాతావరణం మాత్రం చాలా ఫ్రెండ్లీగా ఉందని ఈ వీడియో చూపిస్తోంది. మైదానంలో ఎంత దూకుడుగా ఆడినా, ప్రాక్టీస్ సమయంలో మాత్రం ఆటగాళ్లు సరదాగా గడుపుతున్నారనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాంక్ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది

## శ్రేయస్ అయ్యర్ గాయం తీవ్రత ఎంతంటే?



**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చేతికి గాయమైంది. ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో రషీద్ ఖాన్ వేసిన బంతిని స్ట్రైకర్‌లోని కూపర్ కనోలీ కొట్టాడు. అది నేరుగా వెళ్లి నాన్‌స్ట్రైకర్ శ్రేయస్ అయ్యర్ చేతికి బలంగా తాకింది. దీంతో స్టేడియంలోని పంజాబ్ అభిమానులు కలవరానికి గురయ్యారు. బాధతో విలవిలాడిన శ్రేయస్ ప్రాథమిక చికిత్స చేయించుకున్నాడు. అయినా సరే, బాధతో ఇబ్బందిపడుతూనే బ్యాటింగ్ కొనసాగించేందుకు ప్రయత్నించాడు. అయితే, 18 పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. కనోలీ కీలక ఇన్నింగ్స్‌తో పంజాబ్ తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం తన గాయంపై శ్రేయస్ స్పందించాడు. “తొలి మ్యాచ్‌లోనే విజయం సాధించడం బాగుంది. బంతి బలంగా తాకడంతో బాగా నొప్పి వచ్చింది. అయితే, ఇప్పుడు అంతా బాగానే ఉంది. గెలిచిన ఉత్సాహంలో ఉన్నప్పుడు అపశకునం మాటలు మాట్లాడకూడదు. నేనెప్పుడూ పాజిటివ్ దృక్పథంతోనే ఉంటా. ప్రతీది మన మంచికేనని ఆశిస్తా. కనోలీ ఆటను ఎదురుగా ఉండి చూడటం బాగుంది. నాణ్యమైన షాట్లు కొట్టాడు. స్వల్ప వ్యవధిలో వికెట్లు పడినా కనోలీ మాత్రం చివరివరకూ క్రీజ్‌లో ఉండి జట్టును గెలిపించడం అభినందనీయం. త్వరగా వికెట్లు కోల్పోవడం మమ్మల్ని కాస్త టెన్షన్‌కు గురిచేసింది. నేను పెవిలియన్‌కు చేరిన తర్వాత నా చేతి గురించి ఆలోచిస్తూ ఉండిపోయా. దానికి ఐస్ పెడుతూ కాస్త సపర్యలు చేశా. ఈలోగా రెండు వికెట్లు టపటపా పడ్డాయి. ఐపీఎల్‌లో ఇలాంటి పరిస్థితులు కొత్తేం కాదు. వాటిని అధిగమించి కూపర్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు” అని అయ్యర్ తెలిపాడు.



ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టికలో ఆసక్తికర మార్పులు..

## అగ్రస్థానంలో ఎవరు?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ 2026 సీజన్ ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇప్పటికే కొన్ని జట్లు తమ తొలి మ్యాచ్‌లను గెలిచి ఖాతా తెరిచాయి. మరోవైపు కొన్ని జట్లు మాత్రం ఇంకా మొదటి విజయాన్ని అందుకోలేకపోయాయి. దీంతో ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఏ జట్టు అగ్రస్థానంలో ఉందో, ఏ జట్టు అట్టడుగున ఉందో అనే విషయం ఆసక్తికరంగా మారింది. తమ తొలి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్‌పై ఉత్కంఠభరిత విజయం సాధించింది. తక్కువ స్కోరు నమోదైన ఈ మ్యాచ్‌లో చివరి ఓవర్ వరకు పోరాటం సాగింది. ఈ విజయంతో పంజాబ్ జట్టుకు రెండు పాయింట్లు వచ్చినప్పటికీ నెట్ రన్‌రేట్ పరంగా పెద్దగా మార్పు కనిపించలేదు. ఇప్పటివరకు రాజస్థాన్ రాయల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ మరియు పంజాబ్ కింగ్స్ తమ తొలి మ్యాచ్‌లను గెలిచిన జట్లుగా నిలిచాయి. ప్రస్తుతం లభించిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాయల్స్ అత్యుత్తమ నెట్ రన్‌రేట్‌తో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు రెండో స్థానంలో ఉండగా, ముంబై ఇండియన్స్ మూడో స్థానంలో నిలిచింది. పంజాబ్ కింగ్స్ నాల్గవ స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ తమ తొలి విజయానికి ఇంకా ఎదురుచూస్తున్నాయి. ఇదిలా ఉండగా లక్నో సూపర్ జెయింట్స్ మరియు ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఈరోజు కీలక మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచే జట్టుకు రెండు పాయింట్లు లభిస్తాయి. దీంతో మొదటి రౌండ్ పూర్తయ్యాక పాయింట్ల పట్టిక మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి

## పంత్ కు ఈ సీజన్ సవాలే!

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 2026 ఐపీఎల్‌లో టైటిల్ వేటకు సిద్ధమైంది. ఈ సీజన్‌లో తన తొలి మ్యాచ్‌లో బుధవారం దిల్లీ క్యాపిటల్స్‌ను ఢీకొంటుంది. లఖ్‌నవూ కెప్టెన్ రిషబ్ పంత్‌కు ఈ సీజన్ సవాలే. అతడు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడు. ఎల్ఎస్‌జీ తరపున తన తొలి సీజన్‌లో నిరుడు పంత్ కెప్టెన్‌గా, ప్రధాన బ్యాటర్‌గా రాణించలేకపోయాడు. కీలక ఆటగాళ్లు, ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లు గాయాల బారిన పడడం అతడి పనిని మరింత క్లిష్టంగా మార్చింది. ఈసారి పంత్‌కు పూర్తి ఫిట్‌గా ఉన్న జట్టు అందుబాటులో ఉంది. పేస్ బౌలర్లు షమి, నోకియాల చేరికతో లఖ్‌నవూ మరింత బలోపేతమైంది. గాయాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉన్న యువ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్.. గత ఏడాది కాలంలో తన ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకోవడానికి చాలా శ్రమించాడు. తమ నమ్మకాన్ని అతడు నిలబెడతాడని ఎల్ఎస్‌జీ ఆశిస్తోంది. పేసర్ మోసిన్ ఖాన్ కూడా గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేస్తున్నాడు. మిస్టరీ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ ఈసారి మరింత సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నాడు. బౌలింగ్ విభాగంతో పోలిస్తే ఎల్ఎస్‌జీ బ్యాటింగ్ మరింత స్థిరంగా కనిపిస్తోంది. మిచెల్ మార్ష్, మార్క్రమ్, పూరన్, పంత్, ఇంగ్లిస్‌లతో లైనప్ బలంగా ఉంది. మరోవైపు దిల్లీకి కూడా ఈ సీజన్‌లో ఇదే తొలి మ్యాచ్. రాహుల్, నిశాంక, స్టబ్స్, అక్షర్, మిల్లర్, అశుతోష్ శర్మలతో ఆ జట్టు బ్యాటింగ్ కూడా బలంగానే ఉంది. తొలి కొన్ని మ్యాచ్‌లకు కీలక పేసర్ స్టార్క్ దూరం కావడం ప్రతికూలాంశమే అయినా.. అకిబ్ నబి, నటరాజన్, చమీర, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ వంటి బౌలర్లతో దిల్లీ బౌలింగ్ పదునుగానే ఉంది. ఇప్పటివరకు లఖ్‌నవూతో తలపడ్డ



## రూ.13 కోట్ల ఆటగాడికి నో ఛాన్స్?



**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ రెండో మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. గురువారం(ఏప్రిల్ 2) ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఎస్ఆర్‌హెచ్ తలపడనుంది. తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ చేతిలో ఘోర ఓటమి పాలైన సన్‌రైజర్స్.. ఎలాగైనా తిరిగి పుంజుకోవాలని పట్టుదలతో ఉంది.ఆరెంజ్ ఆర్మీ బ్యాటింగ్ పరంగా ఎంత పటిష్టంగా ఉందో, బౌలింగ్ పరంగా అంతే బలహీనంగా కన్పిస్తోంది. ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ లేని లోటు స్పష్టంగా కన్పిస్తోంది. హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కట్ వంటి ఫాస్ట్ బౌలర్లు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారు. అంతేకాకుండా కొత్తగా జట్టులోకి వచ్చిన సీనియర్ పేసర్ డేవిడ్ పేయిన్, గత సీజన్‌లో అదరగొట్టిన ఎషాన్ మలింగ సైతం విఫలమయ్యారు. దీంతో కేకేఆర్‌తో మ్యాచ్‌కు ఎస్ఆర్‌హెచ్ జట్టులో పలు మార్పులు చోటు చేసుకునే అవకాశముంది. డేవిడ్ పేయిన్ స్థానంలో ఇంగ్లీష్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ తుది జట్టులోకి వచ్చే సూచనలు కన్పిస్తున్నాయి.వాస్తవానికి తొలి మ్యాచ్‌లోనే కార్స్ ఆడాల్సి ఉండేది. కానీ ప్రాక్టీస్ సెషన్‌లో చిన్నపాటి గాయం కారణంగా అతడు మొదటి మ్యాచ్‌కు దూరమయ్యాడు. అయితే ఇప్పుడు అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు సమాచారం. అదేవిధంగా హర్ష్ దూబే స్థానంలో జీషాన్ అన్సారీని ఆడించాలని ఎస్ఆర్‌హెచ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే గత మ్యాచ్‌లో బెంచ్‌కే పరిమితమైన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్‌కు మరోసారి నిరాశే ఎదరయ్యే అవకాశముంది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ వంటి విధ్వంసకర బ్యాటర్లు ఉండటంతో లివింగ్‌స్టోన్‌కు చోటు దక్కడం లేదు. ఒకవేళ లివింగ్‌స్టోన్ ఆడించాలంటే ఎషాన్ మలింగ లేదా పేయిన్‌లో ఎవరో ఒకరిని పక్కన పెట్టాల్సి వస్తుంది. అలా చేస్తే జట్టులో క్వాలిటీ బౌలర్లు ఎవరూ ఉండరు. గతేడాది జరిగిన మినీ వేలంలో రూ.13 కోట్ల భారీ ధరకు ఎస్ఆర్‌హెచ్ కొనుగోలు చేసింది. అంత భారీ ధర చెల్లించినప్పటికి అతడిని ఎస్ఆర్‌హెచ్ ఉపయోగించుకోకపోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



## నా బాదుడు వెనుక ఆ స్వీటే కారణం

ఐపీఎల్ 2026లో భాగంగా సోమవారం చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ పోరులో రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. మ్యాచ్ అనంతరం.. జట్టు బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు ధ్రువ్ జురేల్, వైభవ్ సూర్యవంశీ మధ్య సరదా సంభాషణ చోటుచేసుకుంది. ‘బాగా ఆడావు యంగ్‌స్టర్.. చాలా బాగా ఆడావు’ అని ధ్రువ్ జురేల్.. వైభవ్‌ను ప్రశంసించాడు. ‘ఈ రోజు మ్యాచ్‌కు ముందు రాజ్‌భోగ్ మిఠాయి తిన్నాను’ అని సూర్యవంశీ సరదాగా సమాధానమిచ్చాడు. వైభవ్ కేవలం బ్యాట్‌తోనే కాదు.. చమత్కారమైన మాటల్లోనూ దిట్ట అని చాటుకున్నాడు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
02.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






# తెలుగులో సినిమా నిర్మాణం అంటే జాగ్రత్త అవసరం: బన్నీ వాస్

ముద్ర, సినిమా డెస్క్ :

తెలుగులో సినిమాలు నిర్మించాలంటే ఎంతో జాగ్రత్తగా ఉండాలని ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ పేర్కొన్నారు. టొవినో థామస్ నటించిన కొత్త చిత్రం 'పళ్లిచట్టంబి'ని తెలుగులో విడుదల చేస్తున్న సందర్భంగా జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మలయాళంలో విజయవంతమైన సినిమాకు వచ్చే థియేట్రికల్ ఆదాయం తక్కువైనా అక్కడి నిర్మాతలు సంతృప్తిగా ఉంటారని, అయితే తెలుగులో పరిస్థితి భిన్నంగా ఉందని ఆయన అన్నారు. ఈ సినిమాను దర్శకుడు మారుతి పరిచయం చేశారని, కొచ్చిలో ఈ మూవీ చూసిన తర్వాత తెలుగు ప్రేక్షకులకు మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్ అవుతుందని భావించి రిలీజ్ చేస్తున్నట్లు చెప్పారు. మలయాళ సినిమాలు కాన్సెప్ట్ ఆధారంగా ఉంటాయని అనుకుంటాం కానీ 'పళ్లిచట్టంబి' మాత్రం భారీ స్థాయి కమర్షియల్ మూవీ అని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా టెక్నికల్‌గా కూడా చాలా మంచి స్థాయిలో ఉందని చెప్పారు. అలాగే ఈ సినిమా ద్వారా టొవినో థామస్‌కు తెలుగులో మంచి గుర్తింపు వస్తుందని, హీరోయిన్ కయదు లోహర్‌కు కూడా మరింత అభిమానులు పెరుగుతారని బన్నీ వాస్ అన్నారు. ఈరోజుల్లో సినిమాలకు భాషా హద్దులు లేవని, ఇతర భాషల మంచి చిత్రాలను తెలుగులోకి తీసుకురావడం ద్వారా థియేటర్లు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# విజయ్ ఆంటోని మరోసారి మ్యూజిక్ మ్యాజిక్

**'వంద దేవుళ్లు' నుంచి మెలోడీ పాట విడుదల..**

ముద్ర, సినిమా డెస్క్ :



'బిచ్చగాడు' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత మల్టీ టాలెంటెడ్ నటుడు విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'వంద దేవుళ్లు' మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ సమర్పణలో, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ ఆంటోని సరసన స్వాసిక ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభించగా, ఇప్పుడు ఈ సినిమా నుంచి 'ఇది కలనో' అనే మెలోడీ గీతాన్ని విడుదల చేశారు. ఈ పాటలో విజయ్ ఆంటోని, స్వాసిక మధ్య ఉన్న ప్రేమను ఎంతో అందంగా చూపించారు. పాటలో వారి లుక్స్, భావ వ్యక్తీకరణ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ గీతానికి భాగ్య శ్రీ సాహిత్యం అందించగా, శిభి శ్రీనివాసన్, శిరీష భాగవతుల గాత్రం మరింత మాధుర్యాన్ని తీసుకొచ్చింది. సంగీత దర్శకుడు బాలాజీ శ్రీరామ్ అందించిన బాణీ శ్రోతలను ఆకట్టుకునేలా ఉంది. ఈ చిత్రానికి ఎస్.బి. దర్శన్ కిర్లోష్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా పనిచేస్తున్నారు. విజయ్ ఆంటోని, స్వాసికతో పాటు అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. సమ్మర్ కానుకగా ఈ సినిమాను మే నెలలో విడుదల చేయడానికి మూవీ టీం సిద్ధమవుతోంది.



# గోల్డెన్ సారీలో హెబ్బా క్యూట్ లుక్స్

ముద్ర, సినిమా డెస్క్ :

టాలీవుడ్ హీరోయిన్ హెబ్బా పటేల్ తాజాగా గోల్డెన్ సారీలో క్యూట్ లుక్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. గోల్డ్ కలర్ చీరలో ఆమె ఎంతో అందంగా కనిపిస్తూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. క్యూట్ స్మైల్‌తో పాటు సింపుల్ మేకప్ ఆమె లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చింది. సంప్రదాయ స్టైల్‌లో కనిపించినా గ్లామర్ టచ్ మాత్రం తగ్గలేదు. గోల్డెన్ సారీలో ఆమె అందం మరింత హైలైట్ కావడంతో ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, నెటిజన్లు లైకులు, కామెంట్లతో సందడి చేస్తున్నారు.


# సై ఫై థ్రిల్లర్ 'కిల్లర్' నుంచి డా. పూర్వజ్ ఫస్ట్ లుక్ రిలీజ్

ముద్ర, సినిమా డెస్క్ :




జ్యోతి పూర్వజ్, పూర్వాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సై ఫై థ్రిల్లర్ సినిమా 'కిల్లర్' నుంచి తాజాగా హీరో, డైరెక్టర్ పూర్వాజ్ నటిస్తున్న డా. పూర్వజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఈ పోస్టర్‌లో ఆయన సైంటిస్ట్‌గా కనిపిస్తున్న లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో పూర్వాజ్ ఒక ప్రత్యేకమైన పాత్రలో కనిపించబోతున్నారు. సీఎన్ఏ ఇంటిగ్రేషన్, రాయ్ ప్రోటోకాల్‌కు సంబంధించిన పనులు చేసే సైంటిస్ట్‌గా ఆయన పాత్రను చూపించబోతున్నారు. దర్శకుడిగా ఒక డిఫరెంట్ సై ఫై థ్రిల్లర్ కథను తెరకెక్కిస్తూనే, మరోవైపు సినిమాలో కీలక పాత్రలో కూడా నటిస్తున్నారు. దర్శకుడిగా, నటుడిగా రెండు బాధ్యతలను ఒకేసారి నిర్వహిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాను థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్లపై పూర్వాజ్, పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. మనీష్‌గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి తదితరులు ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాను గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయడానికి మూవీ టీం సిద్ధమవుతోంది.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్ డ్రైవ్‌కు అల్లు అర్జున్ ఫ్యాన్స్ మద్దతు




ముద్ర, సినిమా డెస్క్ :ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమాన సంఘం (AAFA) హెచ్‌పీవీ వ్యాక్సిన్ డ్రైవ్‌కు మద్దతుగా ముందుకొచ్చింది. ఈ ఏడాది మొత్తం ప్రజల్లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఫ్యాన్స్ అసోసియేషన్ తెలిపింది. ప్రతి సంవత్సరం ఒక మంచి పని చేయాలని అల్లు అర్జున్ చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించింది. 9 నుంచి 26 ఏళ్ల మధ్య వయసున్న బాలికలు, మహిళలు ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా పొందవచ్చని కూడా ఫ్యాన్స్ అసోసియేషన్ వివరించింది. సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని పేర్కొంది. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమాన సంఘం ఇలాంటి సామాజిక కార్యక్రమానికి ముందుకు రావడం అభిమానులను ఆకట్టుకుంటోంది.

# "నీకంత సీన్ లేదు" అన్నారు.. అవమానించారు.. : రాశిక శెట్టి

ముద్ర, సినిమా డెస్క్ :

రంగుల ప్రపంచంలో అవకాశాలు దక్కించుకోవడం చాలా కష్టమని, కెరీర్ ప్రారంభంలో తాను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని కన్నడ నటి, బిగ్‌బాస్ బ్యూటీ రాశిక శెట్టి చెప్పింది. ఆడిషన్స్‌కి వెళ్లినప్పుడు ప్రోత్సహించడం బదులు సూటిగా విమర్శలు చేసేవారని ఆమె వెల్లడించింది. ఒకసారి "నీకు నిజమైన బంగారు గొలుసు వేసుకునేంత సీన్ ఉందా?" అని ముఖం మీదే చెప్పారని గుర్తు చేసుకుంది. అవకాశాలు రాకపోవడం, వచ్చినవి కూడా చివరి నిమిషంలో చేజారిపోవడంతో చాలా బాధపడ్డానని రాశిక తెలిపింది. అయినా వెనకడుగు వేయకుండా ఒకరోజు తనకు కూడా మంచి అవకాశం వస్తుందని నమ్మకంతో ముందుకు సాగానని చెప్పింది. అదే నమ్మకం తనను నిలబెట్టిందని పేర్కొంది. కన్నడ బిగ్‌బాస్ 12వ సీజన్ ద్వారా గుర్తింపు పొందిన రాశిక శెట్టి, ఇప్పటికే కన్నడలో కొన్ని సినిమాలు చేసింది. ఇప్పుడు తెలుగులో 'సందేహం' సినిమాతో కూడా ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది.





# చీరలో మరింత కొత్తగా కనిపిస్తున్న ఆశికా

ముద్ర, సినిమా డెస్క్ :

దక్షిణాది హీరోయిన్ ఆశికా రంగనాథ్ తాజాగా పంచుకున్న ఫోటోల్లో చీరలో మరింత కొత్తగా కనిపిస్తోంది. సాధారణంగా గ్లామర్ లుక్స్‌తో కనిపించే ఆశికా, ఈసారి సంప్రదాయ స్టైల్‌లో అభిమానులను ఆకట్టుకుంది. పూల డిజైన్ ఉన్న సాఫ్ట్ కలర్ చీరలో ఆమె లుక్ ఎంతో ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. సింపుల్ మేకప్, చిన్న బొట్టు, స్టైలిష్ జ్యువెలరీతో ఆమె అందం మరింత హైలైట్ అయింది. సాఫ్ట్ లైటింగ్‌లో తీసిన ఈ ఫోటోలు ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపిస్తున్నాయి. సంప్రదాయ లుక్‌లో కూడా ఎంత అందంగా కనిపించగలదో ఆశికా మరోసారి నిరూపించిందని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, చీరలో ఆశికా లుక్‌పై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ఫోటోషూట్‌తో మరోసారి ఆమె అందం హాట్ టాపిక్‌గా మారింది.



# బాడీ హగ్ డ్రెస్‌తో కవ్విస్తున్న దివ్య

ముద్ర, సినిమా డెస్క్ :

తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోల్లో హీరోయిన్ దివ్య తన గ్లామర్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పింక్ కలర్ బాడీ హగ్ డ్రెస్‌లో ఆమె లుక్ స్టైలిష్‌గా కనిపిస్తోంది. ఆఫ్‌షోల్డర్ డిజైన్‌తో పాటు సింపుల్ మేకప్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తోంది. సాఫ్ట్ లైటింగ్‌లో తీసిన ఈ ఫోటోలు ఎంతో ఎలిగెంట్‌గా కనిపిస్తున్నాయి. లాంగ్ హెయిర్‌ను నేచురల్‌గా వదిలేయడం, సైడ్ పోజ్‌లో నిల్చోవడం ఈ ఫోటోషూట్‌కు ప్రత్యేకతను తీసుకొచ్చాయి. గ్లామర్‌తో పాటు కాన్ఫిడెన్స్ కూడా ఈ ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, ఫ్యాన్స్ ఆమె అందాన్ని ప్రశంసిస్తూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోషూట్‌తో మరోసారి దివ్య గ్లామర్ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది



# ఫ్యామిలీతో చూడాల్సిన ఎమోషనల్ మూవీ "పళ్లిచట్టంబి"

ముద్ర, సినిమా డెస్క్ :

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ చిత్రం "పళ్లిచట్టంబి"పై అంచనాలు పెరుగుతున్నాయి. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా ఈ నెల 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. మూవీ ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో హీరో టొవినో థామస్, హీరోయిన్ కయదు లోహర్ సినిమా విశేషాలను వెల్లడించారు. ఈ సినిమా కథ విన్న వెంటనే చేయాలని నిర్ణయించుకున్నానని టొవినో థామస్ చెప్పారు. పాత్ర కోసం లుక్ మార్చుకుని బరువు కూడా పెరిగానని తెలిపారు. 1950ల కాలంలో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కిందని, మానవత్వం ప్రధాన సందేశంగా ఉండే ఒక బ్యూటిఫుల్ ఎమోషనల్ ఫిల్మ్ అని అన్నారు. ఫ్యామిలీ మొత్తం కలిసి చూసేలా ఈ సినిమా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కయదు లోహర్ మాట్లాడుతూ ఈ సినిమా తన కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రం అవుతుందని చెప్పారు. రెబెకా అనే కీలక పాత్రలో కనిపిస్తానని, ఈ సినిమా కోసం వర్క్‌షాప్స్ చేసి ప్రత్యేకంగా ప్రిపేర్ అయ్యానని తెలిపారు. "పళ్లిచట్టంబి" ఒక భావోద్వేగభరితమైన మంచి ఫ్యామిలీ మూవీ అని ఆమె కూడా చెప్పారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com